# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 22 అక్టోబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 287 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## యమునా ఒడ్డున బర్త్ డే జరుపుకోండి



2

## నగరంలో వింటేజ్ కార్ల ప్రదర్శన



2




# నిత్యావసరాల ధరల.. నియంత్రణ ముఖ్యం

### వేగంగా పీఎం సూర్యఘర్
### ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, అక్టోబర్ 21(మనం న్యూస్):** ఎల్ నినో ప్రభావంతో దేశ వ్యాప్తంగా ధరల పెరుగుదల కన్పిస్తోందని, ఆ ప్రభావం నిత్యవసరాలపై పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ సమీక్షలో భాగంగా వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యవసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుబజార్లలో ప్రభుత్వం తరపున అందిస్తున్న బియ్యం అమ్మకాలపై సీఎం ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని... కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయని అధికారులు వివరించారు. అలాగే దీపావళీ, సంక్రాంతి వంటి పండుగల సమయంలో కూడా రైతు బజార్లల్లో తక్కువ ధరకు ఫైన్ రకం బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలన్నారు. అలాగే

...మిగతా 2లో

## దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

మంత్రి టీజీ భరత్



**కర్నూలు అక్టోబర్ 21 మనం న్యూస్:** దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా కర్నూలు నగరంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని సంకల్బాగ్ సమీపంలో తుంగభద్రా నది తీరాన ఏర్పాటు చేసిన దుర్గా ఘాట్లో దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్తో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన

...మిగతా 2లో

## ఏపీ మున్సిపల్ ఎన్నికలు.. నో పొడిగింపు



2

### వైసీపీ నామినేషన్ల దాఖలు గడువు పొడిగింపు అభ్యర్థనపై సుప్రీం కోర్టు

## సుప్రీం కోర్టు అదేశాలు పాటించాల్సిందే..

### కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



**అమరావతి, అక్టోబర్,21,(మనం న్యూస్):** సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలి- ఏడు జిల్లాల (వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం, ప్రకాశం, పల్నాడు, మార్కాపురం) కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశాలు రాష్ట్ర ఎన్నికల సంఘం

...మిగతా 2లో

### జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ
## ప్రక్రియ పరిశీలన

### జిల్లా సాధారణ పరిశీలకులు కె.వి.ఎన్. చక్రధర్ బాబు



**మచిలీపట్నం: అక్టోబర్ 21,(మనం న్యూస్):** కృష్ణా జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా సాధారణ పరిశీలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర బాబు బుధవారం పరిశీలించారు. మచిలీపట్నం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కృష్ణా జిల్లా జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. జిల్లాలోని 26 మండలాలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ కౌంటర్ల వద్ద అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. ఇప్పటివరకు

...మిగతా 2లో

# జాగో..!
## ఎల్‌నినోను ఎదుర్కొందాం
## ప్రకృతి విపత్తుపై 'మన'ం యుద్ధం

manamelnino2026@gmail.com, whatsapp no 9133199333

ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

**– ఎడిటర్**

## వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు

- ఇరాన్ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ

5



## పారిస్‌లో లగ్జరీ స్టోర్ల లూటీ..

### సెకండ్‌హ్యాండ్ మార్కెట్లో అమ్మకం..!

5



## సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాతా మారని చంద్రబాబు తీరు

### దాడులు చేయిస్తూ, తిరిగి మాపై నెపం నెట్టే యత్నం
### సుప్రీంకోర్టు తీర్పునూ వక్రీకరించేందుకు ప్రయత్నాలు
### మళ్లీ అవే అబద్దాలతో సుప్రీంకోర్టును ఆశ్రయించేలా ఉన్నారు
### సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్



**తాడేపల్లి,అక్టోబర్,21,(మనం ప్రతినిధి):** రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బరితెగిస్తున్న వెన్నుపోటు పార్టీ మురాలతో పాటు ఎస్ఈసీకి సుప్రీంకోర్టు ఇవాళ ఇచ్చిన ఆదేశాలు చెంపపెట్టులా ఉన్నాయని వైఎస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్ఈసీ అమలు చేయాలని, తన విస్తృత అధికారాలను వాడి ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాలని సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. ఇవాళ కూడా పరిషత్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా 11 జిల్లాల్లో 76 ఘటనలు జరిగాయని, సుప్రీంకోర్టు ఆదేశాలున్నా బరితెగిస్తున్న వ్యవహారాన్ని తిరిగి అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామని సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

### ప్రెస్ మీట్లో సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకేమన్నారంటే...

**పరిషత్ ఎన్నికల్లోనూ అదే తీరు**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నామినేషన్ల ఉపసంహరణ గడువు ఇవాళ్టితో ముగిసింది. అలాగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ రెండు ఓవర్ ల్యాప్ కావడం గందరగోళానికి దారి తీస్తోంది. ఇది కాకుండా మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా

...మిగతా 2లో

## ఫ్రాన్స్ అల్లర్లలో అమెరికా తీవ్రవాదులు

5



### వాయు కాలుష్యం ఎఫెక్ట్
## మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ

5



## కోడ్‌ను పాటించాల్సిందే.. రూల్స్ ఉల్లంఘిస్తే కత్తిరింపే

2

## వలసలపై ట్రంప్ ఉక్కు పాదం.. 3 లక్షల వీసాల రద్దు

5

## అమల్లోకి భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**ఢిల్లీ, అక్టోబర్ 21 :** భారత్ - న్యూజిలాండ్‌మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీని ద్వారా భారతీయ ఉత్పత్తులపై న్యూజిలాండ్ 100 శాతం దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేసి, సుంకం రహిత ప్రవేశాన్ని కల్పించింది. 2030 నాటికి ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.35 వేల కోట్లకు పెంచడమే లక్ష్యమని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అదనంగా, ఐటీ, ఇంజనీరింగ్, యోగా, ఆయుష్ నిపుణులు, చెఫ్‌ల కోసం న్యూజిలాండ్ ఐదు వేల ప్రత్యేక వీసాలను కేటాయించింది. దీంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సరికొత్త పుంతలు తొక్కనుంది.

### రూబియో పర్యటన వేళ జైశంకర్ స్మార్ట్ థింకింగ్
## పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని బట్టబయలు చేసిన విదేశాంగ మంత్రి



**ఢిల్లీ, అక్టోబర్ 21 :** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యటన వేళ మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పాక్ ఉగ్రవాద వైఖరిని మరో సారి ప్రపంచానికి చాటి చెప్పారు. 2008లో ముంబయిలో జరిగిన మారణహోమానికి ప్రత్యక్ష సాక్షి అయిన సునీల్ కుడ్యాదీని రూబియో ముందుకు తీసుకువచ్చారు. నాటి ఉగ్రఘటనను సునీల్ కళ్లకు కట్టినట్లు వివరించి.. పాక్ కుటిలనీతిని ప్రపంచానికి చాటిచెప్పారు. దీని ఫలితంగా ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశానికి తాము వ్యతిరేకమని రూబియో ప్రకటించాల్సి వచ్చింది. ఇదంతా జైశంకర్-రూబియో భేటీ సందర్భంగా జరిగింది. దీంతో సునీల్ కుడ్యాదీ పేరు నెట్టింట్లో వైరల్ అవుతోంది.

**ఎవరీ సునీల్..**

ముంబయిలో మార్కో రూబియో 26/11 ఉగ్రదాడి స్మారకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అప్పట్లో తాజ్ హోటల్ సెక్యూరిటీ చీఫ్‌గా ఉన్న

...మిగతా 2లో

## ధోబాల్ వ్యూహంతోనే అస్థిరత

### నోరు పారేసుకున్న పాకిస్థాన్



**లండన్, అక్టోబర్ 21 :** భారత్ ప్రత్యర్థుల కుయుక్తులను ముందుగానే గుర్తించి వాటికి చెక్ పెట్టడంలో అజిత్ డోభాల్ దిట్ట. అందుకే ఆయన వ్యూహాలు పాకిస్థాన్‌కు నిద్రలేకుండా చేస్తుంటాయి. ఈ అసహనమంతా పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (విశ్రాంత) మజహర్ జమీల్ నోట బయటపడింది. కొన్ని రోజుల క్రితం లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్

...మిగతా 2లో

## నగరంలో వింటేజ్ కార్ల ప్రదర్శన

**హైదరాబాద్, అక్టోబర్ 21 :** హైదరాబాద్‌లో గోల్కొండ, చార్మినార్ తో పాటు ఎక్కడ చూసినా నిజాం కాలం నాటి గుర్తులే దర్శనమిస్తాయి. ఒక్క సారి చౌమొహల్లా ప్యాలెస్‌కు వెళితే నిజాం నాటి కార్లను చూడొచ్చు. అయితే, కేవలం నిజాములు వాడినవే కాకుండా ఆ కాలంనాటి కార్లు చూస్తే ఆశ్చర్యానుభూతులు కలుగుతాయి. నగరంలోని అబిడ్స్ వద్ద గల చాపల్ రోడ్డులో చర్మాస్ సంస్థ నిర్వహించిన వింటేజ్ కార్ల ప్రదర్శన చూసినా అలాంటి ఫీలింగే కలుగుతుంది. ఏటా నిర్వహిస్తున్న ఈ వింటేజ్ కార్ల ప్రదర్శన ఈ ఏడాదీ నిర్వహించారు. ఇందులో క్లాసిక్ ఆటోమొబైల్స్, వాటి కాలాతీతమైన డిజైన్లతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

## యమునా ఒడ్డున బర్త్ డే జరుపుకోండి

**ఢిల్లీ, అక్టోబర్ 21 :** దేశ రాజధాని ప్రజలకు ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ వినూత్న అభ్యర్థన చేశారు. పుట్టినరోజు వంటి ప్రత్యేకమైన రోజుల్ని యమునానది ఒడ్డున చేసుకోవాలని కోరారు. నదిని శుభ్రంగా ఉంచే ప్రణాళికల్లో భాగంగా ఈ ఆలోచన చేశారు.

'యమునా నది చెంత పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని ఢిల్లీ ప్రజలను కోరుతున్నా. నవంబరు 7న నా పుట్టినరోజును అక్కడే చేసుకోబోతున్నాను. నది ఒడ్డున ప్రజలు తమ సంతోష క్షణాలను ఆస్వాదించినప్పుడు.. అది మురికిగా ఉంటే చూడలేరు. కుటుంబాలు ఒక దగ్గర చేరి, వేడుకలు చేసుకునేందుకు నదీ తీరాల్లో కొన్ని ప్రత్యేక కుటీరాలను ఏర్పాటు చేస్తాం. అలాగే ఘాట్లను శుభ్రం చేయడం వంటి స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనేవారు అక్కడ ఉండొచ్చు' అని ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి పర్వేశ్ అభిప్రాయడ్డారు.

ఆదివారం జరిగిన 'చలో యమున' కార్యక్రమంలో 35వేలమంది పాల్గొన్నారు. వారంతా నదికి ఇరువైపులా ఉన్న 70 ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి ప్రకటన వచ్చింది. నదితో వ్యక్తిగత బంధం ఏర్పడినప్పుడు.. దానిని శుభ్రంగా ఉంచే బాధ్యతను ప్రజలు తీసుకుంటారనేది ఆయన ఆలోచన వెనక ఉద్దేశం. అలాగే యమునానది ప్రక్షాళన, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలను వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లోపు నదిని శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

## ధోబాల్ వ్యూహంతోనే అస్థిరత

(మొదటి పేజీ తరువాయి)

ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్‌లో ఆయన మాట్లాడిన మాటలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. పాకిస్థాన్‌లో అశాంతిని సృష్టించడానికి భారత్ ఉగ్రవాదాన్ని ఒక సాధనంగా వాడుతోందని జమీల్ ఆరోపించారు. టీటీపీ, బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఉగ్ర సంస్థలకు మద్దతు ఇవ్వడం అందులో భాగమేనంటూ చిత్ర విచిత్ర వ్యాఖ్యలు చేశారు. పాక్‌లో అస్థిరతను సృష్టించడానికి అజిత్ డోభాల్ సిద్ధాంతాన్ని అమలు చేస్తోందన్నారు. 1971లో ముక్తి వాహిని, 1980ల్లో ఎల్టీటీఈకి భారత్ మద్దతు ఇచ్చిందని తన ప్రసంగంలో నోరు పారేసుకున్నారు. 2001 నుంచి 2014 మధ్య ఆఫ్ఘాన్ - పాకిసాన్‌కు మధ్య ఉన్న సరిహద్దు సమీపంలో భారత్ ఆరు కాన్సులేట్లు నడిపిందన్నారు. ఇవన్నీ ఉగ్రవాదానికి భారత్ మద్దతు ఇస్తుందనడానికి నిదర్శనమంటూ హాస్యాస్పద వ్యాఖ్యలు చేశారు.

అలాగే గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్లో అణు, సంప్రదాయ ఆయుధాలను మోసుకెళ్లగల బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని ఆరోపించారు. భారత్ అనుసరిస్తున్న 'నో ఫస్ట్ యూజ్' (ముందుగా అణ్వాయుధాలు ప్రయోగించబోం) విధానం ఒక దౌత్యపరమైన వ్యూహం మాత్రమేనని, మొదటిసారే దాడి చేసేలా భారత్ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని మరో చిత్రమైన వాదన వినిపించారు. పాక్‌లోని అంతర్గత అస్థిరతలను ఎలా కట్టడి చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్న షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. ఆ నెపాన్ని భారత్‌పై నెట్టేయడమే ఈ ప్రసంగం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

ఆపరేషన్ సిందూర్ సమయంలో దక్షిణాసియా మొత్తాన్ని భారత్ అణు విపత్తు అంచు వరకు తీసుకెళ్లిందని, అయితే పాకిస్థాన్ వ్యూహాత్మక సంయమనం వల్లే పరిస్థితి చక్కబడిందని జమీల్ సొంత డబ్బా కొట్టుకున్నారు. అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని, అణువ్యాప్తి నిరోధక ఒప్పందం కింద భారత్‌కు ఉన్న మినహాయింపులను తొలగించాలన్న లక్ష్యంతో ఈ ఆరోపణలు చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్‌పీటీపై సంతకం చేయకపోయినా.. అణు ఇంధనం, రియాక్టర్లను కొనుగోలు చేయడానికి భారత్‌కు మినహాయింపులు ఉన్నాయి..శత్రువుల కదలికల గమనిస్తూ ఉండిపోకుండా.. అవసరమైతే ఆ దేశ భూభాగాల్లోకి వెళ్లి దెబ్బ కొట్టడాన్ని డోభాల్ డాక్ట్రిన్‌గా చెప్తుంటారు. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు అందులో భాగమే...బ్రహ్మోస్ క్షిపణికి టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్‌ను మోసుకెళ్లే సామర్థ్యం ఉంది. అయితే భారత్ ఆ క్షిపణిని సంప్రదాయ ఆయుధాల కోసమే ఉపయోగిస్తోంది. అణ్వాయుధాలను

## పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని నట్టేట నిలబెట్టిన విదేశాంగ మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

సునీల్ కుడ్యాదీ నాటి భయానక పరిస్థితులను వివరించారు. లష్కరే తయ్యిబా ఉగ్రవాదులు దాదాపు 60 గంటల పాటు హోటల్లో ఎంతటి బీభత్సాన్ని సృష్టించారో వెల్లడించారు. అజిత్ ఢోబాల్ వ్యూహంతోనే పాక్ లో అస్థిరత.. నోరు పారేసుకున్న దాయాది

దేశం కోసం తమవంతుగా పోరాడిన ఎంతో మంది అన్సంగ్ హీరోల్లో కుడ్యాదీ ఒకరు. 2008, నవంబర్ 26న జరిగిన దాడిలో ఇతరులను అప్రమత్తం చేయడంలో కీలక పాత్ర పోషించారు. హోటల్ భద్రతా బాధ్యతలు చూస్తుండటంతో ఆ భవనం గురించి పూర్తి పట్టు ఆయనకుంది. అదే భద్రతా సిబ్బంది ఆపరేషన్లో కీలకమైంది. పోలీసులు, కమాండోలకు దారిచూపించారు. రెండు రాత్రుల్లు మూడు పగళ్లు మొత్తంగా 60 గంటలపాటు ఉగ్రవాదుల ముట్టడిలో ఉన్న హోటల్లోపలే ఉండి సహాయక చర్యలకు తోడ్పడ్డారు. ఆయన అనుభవం భారీ ప్రాణనష్టాన్ని నివారించారు.

## సీజేపీకి ఊరట..

- సౌరవ్, అశుతోష్ విడుదలకు కోర్టు ఆదేశం




హైదరాబాద్, అక్టోబర్ 21 : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా విడుదలకు ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశించారు. జంతర్ మంతర్లో నిరసనలు చేపట్టినందుకు గానూ విధించిన జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగియడంతో వారిద్దరినీ పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా పూచీకత్తుపై విడుదలకు ఎస్ఈఎం ఆదేశించారు.

జంతర్ మంతర్ను డీనోటిఫై చేసిన అనంతరం అక్టోబర్ 14న నిరసనలు తెలియజేయడంతో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను అరెస్టు చేసిన పోలీసులు.. వారిని కోర్టులో హాజరు పరచగా 5 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అనంతరం కస్టడీని ఈ నెల 19న మరో రెండు రోజుల పాటు పొడిగించారు. ఆ గడువు బుధవారంతో ముగిసింది. దీనిపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. కస్టడీ విషయంలో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు వెలువడే వరకు వేచి చూడాలని, లేదంటే పైకోర్టుకు వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే నేతలిద్దరికీ ఈ సాయంత్రానికి ఊరట లభించింది.

## నిత్యావసరాల ధరల.. నియంత్రణ ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటులో మరింత పురోగతి సాధించాలని, ప్రస్తుతం జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని... దీన్ని మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా తొమ్మిది లక్షల కనెక్షన్లను ఏర్పాటు చేయాలని... వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేలా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాలనలో టెక్నాలజీని పూర్తిగా ఉపయోగించుకుని ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని సీఎం పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగ్గా జరగాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి, అనంతరం రావణ వధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత గంగా హారతి నిర్వహించి, అమ్మవారి తొలి విగ్రహాన్ని నిమజ్జనం చేసి నిమజ్జన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. తొలుత ఒకే విగ్రహంతో ప్రారంభమైన దుర్గామాత ఉత్సవాలు నేడు నగరవ్యాప్తంగా అనేక విగ్రహాల ఏర్పాటుతో ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. భక్తుల భాగస్వామ్యం, ప్రజల ఆదరణతో కర్నూలులో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఏటా మరింత వైభవాన్ని సంతరించుకుంటున్నాయని చెప్పారు. గీతా ప్రచార సంఘం, విశ్వహిందూ పరిషత్, టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష, టీజీ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించిన నామినేషన్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలని, ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిశీలకులతో పాటు రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో ఎం శ్రీహరి తదితర ఎన్నికల అధికారులు ఉన్నారు.

## సుప్రీం కోర్టు అదేశాలు పాటించాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది అందించిన సమాచారం మేరకు... సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కాపీ ఇంకా రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందాల్సి ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఉత్తర్వులు అందిన వెంటనే సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తామని, ఈ విషయంలో అధికారులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్ఈసీ కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లికార్జున, ఏడీజీపీ ఎస్. మధుసూధన రెడ్డి, ఐజీ బి. రాజకుమారి, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు అందిన తదుపరి మరియు జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా రాష్ట్ర ఎన్నికల సంఘం తగిన నిర్ణయము తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో 7 జిల్లాల్లోని 19 మున్సిపాలిటీస్ మినహా మిగిలిన అన్ని మున్సిపాలిటీస్, కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ యధావిధిగా కొనసాగుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు.

**ఎన్నికల ప్రక్రియలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు**

మున్సిపల్ సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లు సమర్పించే సమయంలో అభ్యర్థులకు తగిన రక్షణ కల్పించాల్సి ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పోలీసు శాఖను ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా శాంతియుత వాతావరణం లో ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**ఎన్ఓసీ, నో డ్యూ సర్టిఫికెట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత**

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసి), నో డ్యూ సర్టిఫికెట్ సమర్పించాలంటూ కొందరు రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓస్), ఎన్నికల అధికారులు (ఈఓస్) నిబంధనలు విధిస్తున్నారని కొన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువచ్చాయి. ఈ అంశంపై స్పష్టతనిస్తూ, అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో తప్పనిసరిగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, నో డ్యూ సర్టిఫికెట్ సమర్పించాలనే నిబంధన ఎన్నికల నియమావళిలో లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అదనపు నిబంధనలు విధించకుండా, అర్హులైన అభ్యర్థులు నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.

## ఏపీ మున్సిపల్ ఎన్నికలు.. నో పొడిగింపు

**ఢిల్లీ, అక్టోబర్ 21 :** నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలన్న వైసీపీ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 19 చోట్ల తమను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ తన పిటిషన్లో పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. నామినేషన్ల గడువు మొత్తంగా వాయిదాకు, పొడిగింపునకు నిరాకరించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది.



నామినేషన్లపై ఇప్పటికే ఫిర్యాదులు అందిన చోటే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నామినేషన్లకు అవకాశం కల్పిస్తే జిల్లా కలెక్టర్ వద్ద కూడా దాఖలుకు పరిశీలించాలని, దీనిపై గురువారంలోపు నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి సూచించింది. మరోవైపు అభ్యర్థుల తుది జాబితా ప్రకటన గడువును ఈనెల 25 వరకు సుప్రీంకోర్టు పొడిగించింది. కోర్టుల్లో కేసులు వేయడం తప్ప.. ఎక్కడా ఫిర్యాదులు చేయలేదని ఎస్ఈసీ తెలిపింది. తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఈనెల 27న నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

విచారణ సందర్భంగా వైసీపీ ఎంపీలు, నేతలు పలుచోట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నామినేషన్ కేంద్రంలో ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరులు చేసిన అరాచకాలను వివరించారు. నామినేషన్ కేంద్రంలో ఉన్న వారిని కారుతో ఢీ కొట్టించిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 15, 16వ తేదీల్లో దురుద్దేశంతో తీవ్ర హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని.. రాజకీయ కుట్రకు తెరలేపారని ఎస్ఈసీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. వైకాపా అరాచకంతో భద్రత మధ్య ప్రజలను తరలించాల్సి వచ్చిందన్నారు. పంజాబ్లోని పఠాన్కోట్ ప్రాంతం నుంచి మారణాయుధాలతో దుండగులను వైకాపా దిగుమతి చేసుకుందని.. వారిని పోలీసులు అరెస్ట్ చేశారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పంజాబ్ నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర ముఠాల దగ్గర ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదని ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు.

## కోడ్‌ను పాటించాల్సిందే.. రూల్స్ ఉల్లంఘిస్తే కత్తిరింపే

**ఢిల్లీ, అక్టోబర్ 21 :** దేశంలోని ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానళ్లకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక సూచనలు జారీ చేసింది. కార్యక్రమాల ప్రసారంలో కేబుల్ టెలివిజన్ నెట్వర్క్స్ (రెగ్యులేషన్) చట్టం-1995 కింద నిర్దేశించిన ప్రోగ్రామ్ కోడ్ ను కచ్చితంగా పాటించాలని హెచ్చరించింది.

నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు టీవీ ఛానెళ్లు మరింత బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాన్ని పాటించాలని సూచిస్తూ పలు ఆదేశాలు జారీ చేసింది.

**మతాల విషయంలో జాగ్రత్త...**

వార్తల ప్రసారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రసారం చేయకూడదని సూచించింది. హింసాత్మక దృశ్యాలను ప్రసారం చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, లైంగిక నేరాల బాధితుల గుర్తింపును బయటపెట్టకూడదని ఆదేశించింది. భారతదేశానికి సంబంధించిన మ్యాప్లను ప్రసారం చేసేటప్పుడు ప్రామాణికమైన మ్యాప్లనే ఉపయోగించాలని మంత్రిత్వ శాఖ సూచించింది. మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టే లేదా దేశ వ్యతిరేక భావాలను ప్రోత్సహించే కంటెంట్ ప్రసారం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

**జర్నలిజం ప్రమాణాలను పాటించాలి:**

అలాగే వార్తలు, కార్యక్రమాల తయారీలో కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రసారమయ్యే కంటెంట్ విశ్వసనీయతను నిర్ధారించేందుకు ఎడిటోరియల్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని పేర్కొంది. ఈ మార్గదర్శకాల ద్వారా టీవీ ఛానళ్లు బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రమాణాలను పాటించాలని కేంద్రం స్పష్టం చేసింది. టెలివిజన్ ప్రసారాల నాణ్యత, సామాజిక బాధ్యత మరియు దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రసార సంస్థలు ఈ మార్గదర్శకాలను తక్షణమే అమలు చేయాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

## సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాతా మారని చంద్రబాబు తీరు

(మొదటి పేజీ తరువాయి)

మా అభ్యర్థుల్ని అడ్డుకోవడం, స్క్రూటినీలో అడ్డగోలుగా తిరస్కరించడం, స్క్రూటినీకి మా అభ్యర్థులు రానివ్వకుండా అడ్డుకోవడం చేశారు. అలాగే విత్ డ్రా చేసుకోమనే బెదిరింపులు కూడా కొనసాగాయి. ఆ విధంగా పోలీసుల తప్పుడు కేసులు, వీళ్ల అండతో టీడీపీ నాయకుల బెదిరింపులు కొనసాగాయి. ఈ కారణాల వల్లే మా అభ్యర్థులు కొన్ని చోట్ల విత్ డ్రా చేసుకున్నారు తప్ప డమ్మీగా నిలబడటమో, వైఎస్సార్సీపీ తరపున నిలబడాలన్న కోరిక వారికి లేకపోవడమూ కాదు. పోలీసులు, అధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నుంచి నుంచి తప్పించుకునేందుకు, గంజాయి, ఇతర తప్పుడు కేసుల్లో ఇరికిస్తామనే బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. ఇవాళ మొదలైన పరిషత్ ఎన్నికల నామినేషన్లలోనూ ఇవన్నీ కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు వీటిపై ఫిర్యాదులు చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. పోలీసులకు, డీజీపీకి ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేదని ఎస్ఈసీకి చెప్తే .. ఆయన ఆ ఫిర్యాదుల్ని తిరిగి వారికే పంపడం, అధికారులకు నీతి సూత్రాలు చెప్పడం జరుగుతూనే ఉన్నాయి. ఆచరణలో మాకు పై నుంచి ఒత్తిడి ఉంది, ఏమనుకోకండి, మీరు నామినేషన్లు వేయొద్దని బుజ్జగింపులు, బెదిరింపులు, ఇవేవీ కుదరకపోతే తప్పుడు కేసులు పెడుతున్నారు. వీటిపైనే మేం కింది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసినా ఫలితం లేక సుప్రీంకోర్టు వరకూ వెళ్లాం.

**సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం**

వీటి మీద సుప్రీంకోర్టు ఒక మంచి తీర్పు ఇచ్చింది. ఇది చాలా సంతోషకరమైన విషయం. మేం ఫిర్యాదు చేసిన మున్సిపాలిటీల్లో నామినేషన్ల తుది జాబితా ఖరారు 25వ తేదీ వరకూ వాయిదా వేయాలని, రేపు సాయంత్రం వరకూ ఫిర్యాదులపై ఓ నిర్ణయం తీసుకోవాలని చెప్పడం, డీజీపీకి సీసీటీవీ కెమెరాలు పెట్టాలని చెప్పడం మంచి పరిణామాలే. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన అధికారాలు ఉపయోగించి సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేస్తుందని ఆశిస్తున్నాం. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తో పాటు డీజీపీ కూడా ఇవన్నీ పాటించినట్లు కాంప్లయెన్స్ రిపోర్ట్ 27వ తేదీ కల్లా ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పింది. సీసీటీవీ కెమెరాలు లేవని చెప్తే అదో పెద్ద లోపం అవుతుంది. గతంలో హైకోర్టు, ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా సీసీ కెమెరాలు పెట్టాలని చెప్పాయి. ఇదంతా జరుగుతుండగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ పోలీసుల అండతో ఇలాంటి కుట్రల్ని అమలు చేస్తున్నారు. టీడీపీ కన్నుసన్నల్లో నడిచే పోలీసు అధికారులతో, నిష్పాక్షికంగా ఉండాల్సిన ఎన్నికల అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. టీడీపీ చెప్పుచేతల్లో ఉండి వాళ్లు చెప్పినట్లు వింటున్నారు. విజిలెన్స్ కేసుల భయంతోనో, రెడ్ బుక్ వల్ల ఇబ్బందులు వస్తాయనో భయంతోనే, ఈ ప్రభుత్వం వల్ల ప్రయోజనాలు పొందుతున్న వారో ఇలాంటి అధికార దుర్వినియోగం చేస్తున్నారు.



## స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

- 24 గంటల సీసీటీవీ నిఘా

**తప్పనిసరి : జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**

**విశాఖపట్నం, అక్టోబర్ 21:** పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలు-2026లో పోలైన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్లు వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సుల రవాణా, భద్రపరిచే ప్రక్రియ, భద్రత, నిరంతర పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులతో పాటు ప్రిసైడింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్ను నిర్దేశించిన వాహనాలు, మార్గాల ద్వారా పోలీసు భద్రత నడుమ రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అభ్యర్థులు లేదా వారి పోలింగ్ ఏజెంట్లు ఈ వాహనాలను అనుసరించేందుకు అనుమతించాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్లో భద్రపరచాలని చెప్పారు.

## జెడ్పీటీసీ స్థానాలకు మొదటి రోజు మూడు నామినేషన్లు

**పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ జి. విద్యాధరికి నామినేషన్ పత్రాల సమర్పణ**

**విశాఖపట్నం, అక్టోబర్ 21:** విశాఖపట్నం జిల్లాలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మొదటి రోజు బుధవారం జెడ్పీటీసీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరికి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. పద్మనాభం జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీకి చెందిన కాళ్ల పద్మ, కాళ్ల సత్యవతి నామినేషన్లు దాఖలు చేయగా, ఆనందపురం జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మజ్జి వెంకటరావు నామినేషన్ పత్రాలను సమర్పించారు. దీంతో మొదటి రోజు జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ నామినేషన్లను సమర్పించాలని ఎన్నికల అధికారులు సూచించారు.


ANNEXURE : 15
FORM-V
LIST OF NOMINATIONS RECEIVED
Election to ZPTC Territorial Constituency of Zilla Praja Parishad VISAKHAPATNAM

| Sl. No. of Nomination Paper | Name of Candidate | Father's or Husband's Name | Age of the candidate | Occupation & Address | Particulars of Caste or Tribes for candidates belonging to SC or ST or BC | Electoral Roll number of Candidate | Name of the Proposer | Electoral Roll No. of Proposer | Name of the Political Party | Symbols chosen in order of preference by the candidate |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) |
| 1 | KALLA PADAMA | NAGESH KUMAR | 41 | HPCL RETAIL OUTLET | BC-D | 922 | KALLA SANAYASI NAIDU | 2274 | TDP | |
| 2 | KALLA SATAYAVATHI | APPALA PAIDANNA | 63 | BUSSINESS | BC-D | 920 | BUGATHA SRINU | 1390 | TDP | |
| 3 | MAJJI VENKATA RAO | MAJJI APPALA MAJJI | 60 | AGRICULTURE/SHARE IN MVR ENGINEERING WORKS/DIRECTOR & SHARE IN THAPATI SPIRAL | BC-D | 198 | MAJJI NAGENDRA | 992 | YSRCP | |

Place : VISAKHAPATNAM
Date : 21.10.2026

Signature of the Returning Officer

## గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల బరిలో 15 మంది

- 21 మందికి గాను ఆరుగురు నామినేషన్ ల ఉపసంహారణ
- వారు పోను బరిలో నిలిచిన 15 మంది

**విశాఖ:** తేదేపా నుంచి ముక్కా శ్రావణి, వైకాపా నుంచి వరుదు కల్యాణి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి దేవర నాగ సునంద దేవి, బహుజన సమాజ్ పార్టీ నుంచి కరణం కీర్తన గ్రేస్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి నమ్మి భవాని నిలవగా.. మిగిలిన అందరూ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు.

## అమెరికా శాటిలైట్‌ను ఢీకొట్టబోయిన రష్యా ఉపగ్రహం..!

**వాషింగ్టన్, అక్టోబర్ 21 :** అంతరిక్షంలో అమెరికా-రష్యా మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇటీవల రష్యాకు చెందిన సైనిక ఉపగ్రహం 'కాస్మోస్ 2612' అమెరికాకు చెందిన ఐసీఈవైఈ-ఎక్స్36 అనే నిఘా రాడార్ ఉపగ్రహాన్ని ఢీకొట్టబోయింది. చివరి నిమిషంలో రష్యా ఉపగ్రహం నాటకీయంగా వెనక్కి తగ్గడంతో ఉద్రిక్తతలు శాంతించాయి. వాస్తవానికి ఐసీఈవైఈ-ఎక్స్36 శాటిలైట్ ఉక్రెయిన్‌కు అవసరమైన సైనిక నిఘా సమాచారం, చిత్రాలను అందిస్తుండటం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్లో రష్యా సోయజ్ రాకెట్ సాయంతో ఆరు ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటికి సైనిక శ్రేణి ఉపగ్రహాలకు పెట్టే కాస్మోస్ పేరును పెట్టి.. 2609



నుంచి 2614 వరకు నంబర్లు కేటాయించింది. అయితే.. ఇవి కచ్చితంగా అంతరిక్షంలో ఏ పనిచేస్తాయో మాత్రం వెల్లడించలేదు. ఇక ICEYE సంస్థ పోలాండ్ కేంద్రంగా పనిచేస్తోంది. అమెరికాలో అనుబంధ సంస్థ ఉంది. ఐసీఈవైఈ-ఎక్స్36 ను అమెరికా ఉపగ్రహంగా నమోదు చేశారు. ఈ సంస్థ 2022 ఆగస్టులో ఒక ఉపగ్రహాన్ని ఉక్రెయిన్‌కు బదిలీ చేసినట్లు ప్రకటించింది. అయితే దేనిని చేసిందో వివరాలు మాత్రం వెల్లడించలేదు. రష్యాపై యుద్ధంలో ఇది ఉక్రెయిన్కు ఉపయోగపడుతుందని పేర్కొంది. ఇటీవల సెప్టెంబర్ 30వ తేదీన రష్యాకు చెందిన కాస్మోస్ 2612 తమ శాటిలైట్ కక్ష్యలోకి రావడం మొదలుపెట్టిందని ఐఇథ్గఉ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల రష్యా ఉపగ్రహం దాదాపు కొన్ని వందల మీటర్ల సమీపానికి వచ్చేసిందని పేర్కొంది. రష్యా ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యకు పాల్పడినట్లు వెల్లడించింది. దానిలో ఆయుధాలు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ఆదివారం రాత్రి నుంచి రష్యా ఉపగ్రహం మెల్లగా దూరం జరగడం మొదలుపెట్టింది. సోమవారం సాయంత్రానికి 250 మైళ్ల దూరం జరిగింది.




# పోలీస్ అమరవీరుల త్యాగాలు అజరామరం..!

- ప్రజా రక్షణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి
- విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో అదనపు జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ
- అక్టోబర్ 21 నుంచి 31 వరకు సంస్మరణ వారోత్సవాలు




**పుట్టపర్తి అక్టోబర్ 21, మనం న్యూస్:** ప్రజల ప్రాణాలకు రక్షణ.. సమాజంలో శాంతిభద్రతలకు భరోసా.. విధి నిర్వహణలో ప్రాణాలనే పణంగా పెట్టే ధైర్యం.. ఇవన్నీ పోలీస్ సేవలకు ప్రతీకలు. ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని హిందూపురం అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పేర్కొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, హిందూపురం అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పస్పుల, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పరేడ్ కమాండర్ ఉమామహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గౌరవ వందనం సమర్పించగా, అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారి కుటుంబాలకు భరోసా కల్పించడం సమాజం బాధ్యతగా గుర్తించాలన్నారు. పోలీస్ యూనిఫామ్ అంకితభావం, ధైర్యం, క్రమశిక్షణకు ప్రతీక అని, ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్లో చైనా దళాలతో జరిగిన ఘర్షణలో పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడంతో పాటు, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రజలకు తెలియజేసేందుకు అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించి వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని రక్షిస్తే, అంతర్గతంగా పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నారని అన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలు కుటుంబాలతో ఆనందంగా గడుపుతున్నప్పటికీ పోలీసులు మాత్రం ప్రజల రక్షణ కోసం విధుల్లో నిమగ్నమై ఉంటారని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.




## నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

### ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు
### పోలీసు అధికారులకు ఎస్పీ సతీష్కుమార్ ఆదేశం

**ధర్మవరం అక్టోబర్ 21 మనం న్యూస్:** జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్కుమార్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. అక్టోబరు 21 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల నేపథ్యంలో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని తాడిమర్రి, బత్తలపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి (సీకేపల్లి), కనగానపల్లి మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు విధుల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. నామినేషన్ల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించేలా చూడాలని, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్, డీఎస్పీలు రత్నాకర్ రాజు, శ్రీనివాసులు, సీఐలు ప్రభాకర్, మహమ్మద్ అలీ, ఇస్మాయిల్, లింగన్న, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## తొలి రోజు 10 నామినేషన్లు దాఖలు

**కాత్రేనికోన అక్టోబర్ 21 మనం ప్రతినిధి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కాత్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జి మమ్మీ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి రాజేశ్వర్ రావులు ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు.మొదటి రోజు మొత్తం 10 నామినేషన్లు వచ్చినట్లు ఆర్. ఓ తెలిపారు. ఇందులో టీడీపీ నుండి 9 ఇండిపెండెంట్ 1 ఉన్నాయి. కాత్రేనికోన1,2 ఎంపీటీసీ స్థానాలకు పచ్చిమట్ల సూర్యనారాయణ రాజు (విలేకర్ రాజు ), పెనుమల్ల లక్ష్మీవాడ ఎంపిటిసి స్థానానికి చీకురుమిల్లి రాజ్యలక్ష్మి,పల్లంకుర్రు 1ఎంపీటీసీ స్థానానికి నల్లి వెంకటరత్నం (రెడ్డి ), వెంట్రు సుధీర్,



కందికుప్ప 1 ఎంపిటిసి స్థానానికి గెడ్డం ప్రమీల, కందికుప్ప 2 ఎంపీటీసీ స్థానానికి గుద్దటి ఝాన్సీ దివ్య కుమారి, గుద్దటి పద్మ కూటమి అభ్యర్థులుగాను, పల్లం 1 ఎం పిటిసి స్థానానికి మల్లాడి శంకర్ ఇండిపెండెంట్ గాను నామినేషన్ వేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థుల సౌకర్యార్థం నామినేషన్ పత్రాలు ఇవ్వడానికి, నామినేషన్ వేసే అభ్యర్థుల సహాయంగా నాలుగు హెల్ప్ డెస్కును ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రాల లోనికి అభ్యర్థితో పాటుగా మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు . నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోపు ర్యాలీగా వచ్చినవారిని ఆపివేసి అభ్యర్థుల ను , ఇద్దరు మద్దతు దారులను మాత్రమే పోలీసులు అనుమతిస్తున్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వి దుర్గా శ్రీనివాస్, అదనపు ఎస్ఐ వి సత్యనారాయణ పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు . రెండవ రోజు అధిక సంఖ్యలో నామినేషన్ దాఖలు అయ్యే అవకాశం ఉంది . ఈ కార్యక్రమం లో రాష్ట్ర మత్స్య కార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, టీడీపీ అధ్యక్షులు చెల్లి సురేష్, దాట్ల పవన్, డి సి ఆకాశం శ్రీనివాసు, జి మంగరావు, గెడ్డం అరుణ్ కుమార్, విజయరామరాజు, ఇసుక పట్ల వెంకటేశ్వర్లు, సిహెచ్ చక్రధర్, నూకల మోహన్, నూకల పెదకాపు, నూకల దుర్గ, నూకల మూర్తి, విత్తనాల బుజ్జి,మాదే యోగేశ్వరి, సుంకర బుజ్జి, గ్రంధి నానాజీ, కోటిపల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కదిరి మున్సిపల్ ఎన్నికలు ధర్మానికి – అధర్మానికి యుద్ధం

- ఎమ్మెల్యే కందికుంట

**కదిరి,అక్టోబర్ 21మనంన్యూస్:** కదిరి మున్సిపాలిటీలోని 44 వార్డులకు గాను 40 వార్డుల టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీ-ఫారాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం అందజేశారు. అలాగే కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ అర్షియా భానుకి హిందూపురం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా బీ-ఫారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అభ్యర్థులకు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.

**వైసీపీ కార్యాలయానికి అనుమతులు ఉన్నాయా?**
**ఎమ్మెల్యే సూటి ప్రశ్నలు**

అనంతరం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వైసీపీ నేతల తీరుపై విమర్శలు చేశారు. కదిరిలో వైసీపీ పార్టీ కార్యాలయం ఏర్పాటుకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు



తీసుకున్నారా? నిబంధనల ప్రకారం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారా? మున్సిపాలిటీకి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించారా? అంటూ ప్రశ్నించారు.

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ ప్రాధాన్యం: ఎమ్మెల్యే**

కదిరి పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన, అవినీతి రహిత పాలన అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

కదిరి మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని చెబుతూ, కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ అర్షియా భానుతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పట్టణ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇండియా ఆర్ట్ మీట్కు అంజి ఆకొండికి ఆహ్వానం

**కాత్రేనికోన అక్టోబర్ 21 మనం ప్రతినిధి :** ఈ నెల 23 వ తారీఖు నుండి 25 వ తారీఖు వరకు మూడు రోజుల పాటు ముంబై లో జరుగబోతున్న ఇండియా ఆర్ట్ మీట్ నందు దేశం నలుమూలలు నుండి 90 మంది ప్రముఖ చిత్రకారులు గీసిన అద్భుత చిత్రాలతో అద్భుతమైన చిత్రకళా ప్రదర్శన జరగబోతోందని చిత్ర కారుడు అంజి ఆకొండి తెలిపారు. . ఈ చిత్రకళా ప్రదర్శనలో తాను గీసిన చిత్రాలకి కూడా ప్రదర్శనగా ఉంచడానికి అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని

బుధవారం ముంబై లోని ప్రముఖ ఆంగ్ల పత్రిక ముంబై మిర్రర్ లో ప్రముఖ చిత్రకారులు సరసన తాను గీసిన చిత్రం ప్రచురితం కావడం చాలా చాలా సంతోషంగా ఉందని అయన తెలిపారు.

## శిక్షణతోనే సమర్థవంతమైన ప్రజాసేవ సాధ్యం..!

- విధి నిర్వహణలో శిక్షణా పాఠాలను ఆచరణలో పెట్టాలి
- జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్
- రెవెన్యూ భవన్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ప్రారంభం.. తొలి బ్యాచ్లో 305 మంది సిబ్బంది




**పుట్టపర్తి, అక్టోబర్ 21 మనం న్యూస్:** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. పుట్టపర్తిలోని రెవెన్యూ భవన్లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తొలి విడత శిక్షణను ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా సాంకేతిక, పరిపాలనా అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సిబ్బందికి సూచించారు. తొలి బ్యాచ్లో 305 మంది సిబ్బంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో శిక్షణ పొందిన సిబ్బంది కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## కార్తీక మాసం భక్తుల రాకకు వసతి ఏర్పాట్ల పరిశీలన

### సత్య నికేతన్ సత్రంలో ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆకస్మిక తనిఖీ



**అన్నవరం, అక్టోబర్ 21, మనం న్యూస్ :** రానున్న కార్తీక మాసంలో శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు వసతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం సత్య నికేతన్ సత్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న సీతారామ సత్రం వద్ద జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను పరిశీలించి, సత్రంలోని గదుల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన పరుపులు, ఇతర వసతులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్తీక మాసంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని కాటేజీలు, సత్రాల్లో వసతి సౌకర్యాలను మెరుగుపరచాలని ఈవో చర్యలు చేపడుతున్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం అధికారులు ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## వివిధ సాంస్కృతి కార్యక్రమంతో దుర్గామాత నిమర్జనం



**బేతంచేర్ల అక్టోబర్ 21( మనం న్యూస్):** దసరా నవరాత్రుల సందర్భంగా పట్టణంలో కాలనీలలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహాలను పట్టణ పురవీధుల గుండా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో అమ్మవారిని ఘనంగా నిమజ్జనకు భక్తులు తీసుకెళ్లారు ఈ నిమజ్జనా కార్యక్రమంలో ఎలాంటి అవాచనీలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఎస్సై రమేష్ బాబు పోలీస్ సిబ్బందితో నిమర్జనా కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఇన్స్పెక్టర్

**ఏలేశ్వరం,అక్టోబర్ 21(మనం న్యూస్):** ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.పోలింగ్ కేంద్రాలు అలాగే కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు ఏలూరు పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ అశోక్ కుమార్ బుధవారం విచ్చేశారు.ఆయనతోపాటు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావుతో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ జనరల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ



ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దీనికిగాను అవసరమైన సిబ్బందిని పోలింగ్ కేంద్రాల వద్ద నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

### రౌతుపాలెంలో వైసీపీకి షాక్..

## టీడీపీలోకి 40 మంది చేరిక



**ప్రత్తిపాడు, మనం న్యూస్ అక్టోబర్ 21:** ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 40 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నాయకుడు నిమ్మల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఏలేశ్వరం మున్సిపాలిటీలోని 22వ వార్డులో ప్రచార కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్తగా పార్టీలో చేరిన వారిని అభినందించారు. టీడీపీలో చేరిన వారిలో కొంగన కుమార్, నేదుళ్ల సత్యనారాయణ, తనగాల సత్యనారాయణ, కొంగన నాగు, గణేసుల చిన్న తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలా ధనబాబు, హరిదాసుల శివ, కొప్పన నాగేశ్వరరావు, బెనుకం సాయి, గుండం సత్తిబాబు, కొంగన నాని, కోలా రాజేష్, దాసరి పండు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అసిస్టెంట్ ప్రొసైడింగ్ అధికారులకు శిక్షణ

### ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలి

**కలెక్టర్ మహేష్ కుమార్ అమలాపురం అక్టోబర్ 21 మనం ప్రతినిధి :** ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే తమ సందేహాలను ప్రిసైడింగ్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నివృత్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవనం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ



సమావేశం నందు రెండవ సాధారణ ఎన్నికల ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ పై తమ సందేహాలను నివృత్తి చేసుకునే విధంగా మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది.

ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ పాల్గొని ఎన్నికల విధివిధానాలు, పోలింగ్ నిర్వహణలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

## ప్రత్తిపాడులో నామినేషన్లకు పటిష్ట పోలీసు బందోబస్తు




**ప్రత్తిపాడు: మనం న్యూస్ అక్టోబర్ 21:** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్, ప్రత్తిపాడు సీఐ బి. సూర్య అప్పారావు పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. నామినేషన్లకు వచ్చే అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## నీళ్లేని శెర్ల

అరె సిన్నప్పుడు సూసిన
గాడ బతుకమ్మలు వాలిన
సెట్టులాగ... బండ వుండెడిది
బండమీద బుర్ద మట్టిల
ఎంపల్ సెట్టు గుచ్చి ఎంత భక్తిగ
సూసెటోడో నాయిన
గప్పుడు గూడ బతుకమ్మ
మా కులపోళ్ల పాటే..మా రోటికాడ బాడేది
మా బండ ఏరే...ఆళ్ల బండ ఏరే
మా బతుకమ్మలా
తంగెడు పూలు..గునుగు పూలూ
రోకలి బండ పూలు..కావంచపూలు
సోంపూలు
గా కులపోళ్లది గూడా
మాలెక్కనే వుండె...
మరెగాళ్లు గాడెందుకాడాలె
మనం గీడెందుకు
నాయననెన్నిసార్లడిగినా
ఆరోతరగతి తెలుగుపుస్తకం
గదంతేరా అనెటోడు.. నాయిన..
గిప్పుడు పి.హెచ్‌డీ పట్టా పుచ్చుకుని
మల్లా ఆడికే బోతే ....

బతుకమ్మల గుంపులు
మరిన్ని బెరిగినయ్
కులానికో గుంపు..బజారుకో గుంపు
అందరూ ఒకే గుంపై
ఆడేరోజెప్పుడొస్తదాని
బతుకమ్మకేసి సూస్తే
రంగులు పాలిపోయి
తెల్లగా కనిపించింది
నీల్లేని శెర్ల..దుఃఖంగా దూకేసింది.!

**- చిత్తలూరి సత్య**
9133832246

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**

# జెన్ జీ కి ఒక లేఖ



ఆగు యువతా నీ అడుగులు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. నేటి భారత దేశం యువతరపు ఉత్సాహంతో, సాంకేతిక పరిజ్ఞానంతో, కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా జెన్ జీ యువతలో కనిపిస్తున్న చైతన్యం, ప్రశ్నించే తత్వం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ప్రజాస్వామ్యానికి కొత్త ఆశలను కలిగిస్తున్నాయి. అయితే జంతర్ మంతర్‌లో నిరసనలు, సుప్రీంకోర్టు వద్ద ఆందోళనలు, ఢిల్లీ దిగ్బంధం వంటి పరిణామాల నేపథ్యంలో యువతరం ఆవేశం, ఆలోచన, బాధ్యతల మధ్య సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యం ప్రసాదించిన విలువైన ఆయుధం. కానీ ఆ హక్కును వినియోగించే విధానం కూడా అంతే విలువైనది. మన గొంతు వినిపించాలనే తపనలో మన మాటకు ఉన్న బాధ్యతను, మన అడుగులకు ఉన్న పరిణామాలను మరచిపోకూడదు.

జెన్‌జీ అంటే హద్దులన్నీ దాటేసి ఉరక లేయడం, ఫలితాల గురించి ఆలోచించకుండా దూకుడుగా ముందుకు దూసుకెళ్లడం అని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. వేగంగా స్పందించడం, వెంటనే నిర్ణయం తీసుకోవడం, క్షణాల్లో సమాచారాన్ని వేల మందికి చేరవేయడం ఈ తరానికి ఉన్న గొప్ప బలాలు. కానీ ఆ వేగానికి వివేకం తోడు కాకపోతే అదే బలం బలహీనతగా మారే ప్రమాదం ఉంది. కాళ్లలో ఎంత సత్తువ ఉన్నా ప్రతి పరుగూ గమ్యాన్ని చేరవేయదు. దారిలో ఎత్తుపల్లాలు ఉంటాయి, కనిపించని గోతులు ఉంటాయి. ఊహించని మలుపులు ఎదురవుతాయి. వాటిని గమనించకుండా దూకితే గమ్యం చేరకముందే గాయపడాల్సి వస్తుంది. మన పెద్దలు అనుభవసారంగా ఆచితూచి అడుగు వేయాలన్నారు.

జెన్ జీ ఉడుకు నెత్తురుకు, ఉత్సాహభరితమైన ఆలోచనలకు, స్వేచ్ఛను కోరుకునే మనస్తత్వానికి కొన్ని మాటలు నచ్చకపోవచ్చు. వాటిలో 'ఆగు' అనే మాట ఒకటి. ఆగమని చెప్పడం అంటే నీ వేగాన్ని అడ్డుకోవడం కాదు. నీ ప్రయాణం సురక్షితంగా సాగాలని కోరుకోవడం. ఆలోచించమని చెప్పడం అంటే నీ స్వేచ్ఛను కట్టడి చేయడం కాదు. నీ నిర్ణయానికి బలమైన పునాది వేయడం. ప్రశ్నించవద్దని చెప్పడం కాదు. ప్రశ్నించేటప్పుడు వాస్తవాలను తెలుసుకోమని చెప్పడం. ఇది గద్దింపు కాదు, తరాల మధ్య ఆధిపత్య పోరు కాదు. అనుభవం అనే దీపాన్ని మీ చేతుల్లో పెట్టాలని కోరుకునే పెద్దల ఆప్యాయమైన ప్రయత్నం మాత్రమే. మీ వెనుక మేమున్నాం. మీరు మా ముందున్నారు మీతోనే ఈ దేశం ఉంది! యువతను ఉద్దేశించి పెద్దలు చెప్పాల్సిన అత్యంత ముఖ్యమైన మాట ఇదే. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. మీ కలలు దేశానికి కొత్త దారులు చూపగలవు. మీ ఆలోచనలు సమాజాన్ని మార్చగలవు. మీ పోరాటాలు అణగారిన గొంతులకు బలాన్నివ్వగలవు. మీ శక్తి విధ్వంసానికి కాదు, నిర్మాణానికి ఉపయోగపడాలి. మీ ఆవేశం ద్వేషాన్ని పెంచడానికి కాదు, అన్యాయాన్ని ప్రశ్నించడానికి ఉపయోగపడాలి. మీ నిరసన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి కాదు, దానిని మరింత బలోపేతం చేయడానికి దోహదపడాలి.

సోషల్ మీడియా యుగంలో ఒక వార్త క్షణాల్లో దేశమంతటా వ్యాపిస్తోంది. ఒక వీడియో, ఒక సందేశం, ఒక నినాదం వేల మందిని ప్రభావితం చేయగలుగుతున్నాయి. కానీ ప్రతి వైరల్ వార్త నిజం కాదు. ప్రతి ప్రచారం వెనుక ప్రజాహితం ఉండకపోవచ్చు. అందుకే ఏ విషయాన్నైనా నమ్మే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలి. భావోద్వేగాలకులోనై స్పందించే ముందు ఆధారాలను చూడాలి. మీ ఒక్క పోస్ట్ మరొకరి జీవితాన్ని ప్రభావితం చేయవచ్చు. బాధ్యతారహితమైన వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రచారం, వ్యక్తులపై ద్వేషపూరిత దాడులు చివరికి మీ భవిష్యత్తుకే అడ్డంకులు సృష్టించవచ్చు. స్వేచ్ఛగా మాట్లాడటం మీ హక్కు. హక్కులను గౌరవిస్తూ మాట్లాడటం మీ బాధ్యత.

ప్రజాస్వామ్యంలో నిరసనలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, అన్యాయాన్ని వ్యతిరేకించడం, తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం పౌరుల హక్కు. జంతర్ మంతర్ వంటి నిరసన వేదికలు ప్రజల గొంతును వినిపించడానికి ఉపయోగపడతాయి. అయితే నిరసన శాంతియుతంగా, చట్టబద్ధంగా, ప్రజల జీవనానికి అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సాగినప్పుడే దాని నైతిక బలం పెరుగుతుంది.

సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం, న్యాయవ్యవస్థ స్వతంత్రత పట్ల విశ్వాసం ప్రజాస్వామ్యానికి అవసరం. మన డిమాండ్లు ఎంత న్యాయమైనవైనా, వాటిని సాధించడానికి అనుసరించే మార్గాలు కూడా బాధ్యతా యుతంగా ఉండాలి. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. అనేక



భాషలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిసిన ఈ దేశాన్ని ఐక్యంగా నిలబెట్టేది మన రాజ్యాంగం. దేశ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. ఇతర దేశాల్లో కనిపించే నియంతృత్వ ధోరణులను చూసి మనమూ అదే దారిలో నడవాలని అనుకోవడం ఎంతటి పొరపాటో, ప్రజాస్వామ్య స్వేచ్ఛను ఉపయోగించుకుంటూ రాజ్యాంగ విలువలను విస్మరించడం కూడా అంతే ప్రమాదకరం. మనకు నచ్చని అభిప్రాయాలను వినడం, వాటిని తర్కంతో ఎదుర్కోవడం, చట్టబద్ధమైన మార్గాల్లో మన వాదనను వినిపించడం నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి. దేశభక్తి అంటే ప్రశ్నించకపోవడం కాదు. దేశాన్ని మరింత న్యాయంగా, సమానత్వంతో, అభివృద్ధి పథంలో నడిపించాలనే బాధ్యతతో వ్యవహరించడం.

యువ మిత్రులారా! జీవితంలో ప్రతి క్షణం పరుగెత్తాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు ఆగి ఆలోచించడం కూడా విజయంలో భాగమే. ఒక ఉద్యమంలో పాల్గొనే ముందు దాని లక్ష్యాలను, పద్ధతులను అర్థం చేసుకోండి. మీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోండి. కుటుంబ సంబంధాలను, స్నేహాలను, చదువును, వృత్తిపరమైన భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకండి. మీ జీవితాన్ని మార్చే నిర్ణయాలు తీసుకునేటప్పుడు క్షణికావేశం కంటే దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వండి. గుర్తుంచుకోండి వేగం మీకు విజయాన్ని అందించవచ్చు, వివేకం ఆ విజయాన్ని నిలబెడుతుంది. ఆవేశం ఉద్యమాన్ని ప్రారంభించవచ్చు. ఆలోచన దానికి సరైన దిశను చూపుతుంది. ధైర్యం మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. బాధ్యత మీ ప్రయాణాన్ని గౌరవప్రదంగా మారుస్తుంది.

జెన్ జీ యువతా! మీలోని అగ్నిని ఆర్పమని మేము చెప్పడం లేదు. ఆ అగ్ని అజ్ఞానాన్ని దహించాలి, అన్యాయాన్ని ప్రశ్నించాలి, అసమానతలను తొలగించాలి, సమాజంలో వెలుగులు నింపాలి. మీ గొంతు వినిపించాలి, మీ ప్రశ్నలు మార్పును తీసుకురావాలి, మీ ఆలోచనలు దేశానికి మార్గదర్శకం కావాలి. కానీ ఆ ప్రయాణంలో రాజ్యాంగాన్ని గౌరవించండి, చట్టాన్ని పాటించండి, భిన్నాభిప్రాయాలను సహించండి, మానవత్వాన్ని మరచిపోకండి. చివరిగా ఒక్క మాట 'ఆగు' అంటే వెనక్కి తగ్గమని కాదు. సరైన దిశలో ముందుకు సాగమని. 'ఆలోచించు' అంటే భయపడమని కాదు. మరింత ధైర్యంగా నిర్ణయం తీసుకోమని. 'బాధ్యతగా ఉండు' అంటే నీ స్వేచ్ఛను వదులుకోమని కాదు. నీ స్వేచ్ఛకు మరింత విలువ తీసుకురమ్మని. మీ ఆవేశం దేశానికి అవసరం మీ ఆలోచన దేశానికి ఆయుధం కావాలి మీ బాధ్యత దేశానికి బలమవ్వాలి మీ యువశక్తి భారత ప్రజాస్వామ్యానికి చిరస్థాయిగా నిలిచే ప్రేరణ కావాలి.

**- డా. రవి కుమార్ చేగొని**

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.

గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబుపై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.

కొమురం భీం స్ఫూర్తితో దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న



అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు.

నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరా లుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్క ృతి ప్రతిబింబిస్తుంది.

ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టి వేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్ ప్రాంతంలో 48శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించిపోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారిపోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నడవడానికి రోడ్డు, తాగ టానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూము లకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.

**అక్టోబర్ 22... కొమురం భీం జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## మిణుగురులు

ఆరోగ్య బీమా
ఉద్యోగ పెన్షనర్లు
సాధన ధీమా

హైడ్రోజన్ రైలు
పర్యావరణ హితం
కాలుష్యం శూన్యం
భయం వీడాలి
జ్ఞానంతో ఎదగాలి
చేపలవ్వాలి

జ్ఞాన ప్రయాణం
డాలర్ల మోజులోన
మొదటి కే మోసం
నెల్సన్ మండేల
అతనిలా ఉండాలి
అస్తిత్వ పోరు

**దృక్పథాలు**

లీకుల జ్వాల
విద్యార్థుల విలయం
కాక్రోచ్ ల జయం

వాణిజ్యం పాడు
బొద్దింకల్ని తరమండి
వీధులు శుభ్రం

**- రేడియమ్**
9291527757

# స్టార్‌లింక్ వివాదానికి అతీతంగా భారత్‌కు పారదర్శక స్పెక్ట్రమ్ అవసరం

స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడంలో జాప్యం, అసమాన పోటీ ఆరోపణలపై ప్రపంచ కుబేరుడు ఇలాన్‌మస్క్, భారతదేశాల మధ్య వివాదం నెలకొంది. ఇటీవల ప్రస్తుత టెలికామ్ గుత్తాధిపత్యాలను రక్షించడానికి పేరుతెలియని శక్తివంతమైన వ్యాపార ప్రయోజనాలు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నాయని మస్క్ ఆరోపించారు. ఆ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేష్ అంబానీ ప్రభావంపై ఆయన నేరుగా ప్రశ్నించారు. ఈ వైరం కొంతవరకు స్పెక్ట్రమ్ కేటాయింపుపై వచ్చిన విభేదాల నుండి పుట్టుకొచ్చింది. మస్క్ పాలనాపరమైన కేటాయింపును సమర్థించగా, రిలయన్స్ జియో వేలం పాటలను సమర్థించింది. స్టార్‌లింక్ లైసెన్స్‌ను పొందినప్పటికీ, వాణిజ్య సేవలను ప్రారంభించే ముందు ఇది భద్రతా అవసరాలను పూర్తి చేసి, స్పెక్ట్రమ్ కేటాయింపును పొందాల్సి ఉంది. శాటిలైట్ ఆపరేటర్లు అంతా ఒకే రక మైన నిబంధనల చట్రాన్ని అనుసరించాలని, జాతీయ ప్రయోజనాలను కాపాడటానికి, భారతీయ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడానికి భద్రతా మూల్యాంకనాలు అత్యవసరమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

మరోవైపు, స్టార్‌లింక్ సంస్థ రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లతో పంపిణీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇరువర్గాల మధ్య వ్యాపార పోటీఉన్నప్పటికీ వాణిజ్యపరమైన సహకారం సాధ్యమేనని ఇది చూపిస్తోంది. భారత్ తన శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ విస్తరణకు సిద్ధమవు తున్న తరుణంలో విదేశీ పెట్టుబడులు, పోటీ, సరసమైన ధరల ఇంటర్నెట్‌సేవలు. జాతీయభద్ర తలను సమతుల్యం చేయడంలో ఉన్న సవాలును ఈ వివాదం స్పష్టంగా ఎత్తిచూపు తోంది.

భారతదేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ లైసెన్సింగ్ను టెలికమ్యూనికేషన్లశాఖ, భారత టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ ('ట్రాయ్'), టెలికమ్యూనికేషన్స్ చట్టం (2023) పరిధిలోని సంబంధిత అంతరిక్ష రంగ నిబంధనలు నియంత్రిస్తాయి. ఉపగ్రహ సమాచార సేవల కోసం భారతదేశం 'యునిఫైడ్ లైసెన్స్' చట్రం కింద ఉపగ్రహం ద్వారా ప్రపంచవ్యాప్త మొబైల్ వ్యక్తిగత సమాచార సేవలు(జీఎంపీసీఎస్) అనుమతిని ఉపయోగిస్తుంది. టెలికమ్యూనికేషన్ల శాఖ పోర్టల్ ప్రకారం 10 జూన్ 2025 నాటికి మూడు సంస్థలకు అనుమతి ఉంది.

జియో శాటిలైట్ కమ్యూ నికేషన్స్, వన్‌వెబ్ ఇండియా కమ్యూనికేషన్స్, స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్. ప్రచురించ బడిన జీఎంపీసీఎస్ రుసుము నిర్మాణంలో1 కోటి వన్-టైమ్ ఎంట్రీ ఫీజు, సవరించిన మొత్తం రాబడి పై 8% వార్షిక లైసెన్స్ ఫీజుతో పాటు ఇతర వర్తించే ఛార్జీలు ఉంటాయి. ఈ అనుమతి 20 సంవత్సరాలపాటు చెల్లుబాటు అవుతుంది, అలాగే ఒకసారి మరో 10 సంవత్సరాల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది. స్పెక్ట్రమ్ కేటా యింపుకు ప్రత్యేక అనుమతి అవసరం. భారతదేశ స్పెక్ట్రమ్ విధానం ప్రధాన సమస్యగా మిగిలిపో యింది. ట్రాయ్ మే 2025లో సిఫార్సులను విడు దల చేయగా, ఏప్రిల్ 2026లో శాటిలైట్ నెట్‌వర్క్ అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపు లపై మరొక సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభిం చింది.

అమెరికాలో, ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్ వినియోగం, ఎర్త్ స్టేషన్లను నియంత్రిస్తుంది. జనవరి 2026లో, ఇది మరో 7,500 జెన్ 2 స్టార్‌లింక్ ఉపగ్రహాలను ప్రయోగించడానికి స్పేస్‌ఎక్స్‌కు అనుమతి ఇచ్చింది. దీంతో మొత్తం అనుమతించిన సంఖ్య 15,000కు చేరింది. యునైటెడ్ కింగ్డమ్ 'ఆఫ్కామ్' లైసెన్సింగ్ ద్వారా ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, గేట్‌వే ఎర్త్ స్టేషన్లను నియంత్రిస్తుంది. యూరోపియన్ యూనియన్ జాతీయ టెలికామ్ అనుమతులను, ఎంపిక చేసిన శాటిలైట్ సేవలు, సమన్వయం చేసిన స్పెక్ట్రమ్ బ్యాండ్ల కోసం ఉమ్మడి నిబంధనలతో అనుసంధానిస్తుంది. ఆస్ట్రేలియాకు చెందిన 'ఆస్ట్రేలియన్ కమ్యూనికేషన్స్ అండ్ మీడియా అథారిటీ' ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, ఎర్త్ స్టేషన్లు, ఫ్రీక్వెన్సీ వినియోగం, అంతర్జాతీయ సమన్వయ అవసరాల నిబంధనలను నియంత్రిస్తుంది. ఈ దేశాలతో పోలిస్తే, స్పెక్ట్రమ్ ధర నిర్ణయం, భద్రతా అనుమతులు, గేట్‌వే అవసరాలు, చట్టబద్ధమైన సమాచార నిఘా, శాటిలైట్ వర్సెస్ సాంప్రదాయ టెలికామ్ ఆపరేటర్ల మధ్య నిష్పాక్షికమైన పోటీ వంటివి భారతదేశంలోని ప్రధాన విధానపరమైన సవాళ్లు. పారదర్శకమైన లైసెన్సింగ్ సమయపరిమితులు, అంచనా వేయదగిన స్పెక్ట్రమ్ ఛార్జీలు, స్పష్టమైన భద్రతా నిబంధనలు పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సేవలు సరిగ్గా అందని ప్రాంతాలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని విస్తరించడానికి దోహదపడతాయని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయి.




స్పేస్‌ఎక్స్ ద్వారా నిర్వహించబడే ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవ స్టార్‌లింక్‌ను, 100 కోట్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్న భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టాలని ఇలాన్ మస్క్ భావిస్తున్నారు. స్టార్‌లింక్‌కు ప్రపంచవ్యాప్తంగా నూట అరవై ఐదుకు పైగా దేశాల్లో అనుమతులు ఉన్నాయి. ఫైబర్-ఆప్టిక్ కేబుళ్లు, మొబైల్ టవర్లు ఏర్పాటు చేయడం కష్టతరమైన సుదూర గ్రామాలు, పర్వత ప్రాంతాలు, దీవులు, ఇతర ప్రాంతాలలో బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడానికి స్టార్లింక్ తక్కువ ఎత్తులో ఉండే భూ కక్ష్య, ఉపగ్రహాలను ఉపయోగిస్తుంది. నెలవారీ ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు,యూజర్-టెర్మినల్‌విక్ర యాలు, వ్యాపారాలు, సంస్థలకు అందించే కనెక్టివిటీ సేవల ద్వారా ఇది రాబడిని పొందుతుంది. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ గ్రామీణ కనెక్టివిటీని మెరుగు పరచడంతో పాటు సుదూర ప్రాంతాలలో విశ్వసనీయ ఇంటర్నెట్ అవసరమయ్యే సంస్థలు, రవాణా ఆపరేటర్లు, ఇతర వినియోగదారులకు ఉపయోగ పడుతుంది. కాబట్టి భారతదేశం ఇందులో గణనీయమైన వృద్ధి సామర్థ్యాన్ని అందిస్తుంది. అక్టోబర్ 8, 2026న, మస్క్ శక్తివంతమైన వ్యాపార ప్రయోజనాలు తమ మార్కెట్ స్థానాలను కాపాడుకోవడానికి స్టార్‌లింక్ ప్రవేశాన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు, అయితే ఈ ఆరోపణకు మద్దతుగా ఆయన ఎలాంటి బహిరంగ ఆధారాలను అందించలేదు. అక్టోబర్ 9, 2026న, వార్తా ప్రసారాల శాఖమంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందిస్తూ, 'భారతదేశం ఏ రంగం లోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని ప్రభుత్వం సాంకేతికత పట్ల తటస్థ విధానాన్ని అనుసరిస్తుందని, స్పెక్ట్రమ్-ఛార్జీల విధానాన్ని ఖరారు చేస్తున్నట్లు సింధియా తెలిపారు. భారతదేశంలో స్టార్‌లింక్ ప్రవేశం వల్ల భారత ప్రభుత్వం, రిలయన్స్ జియో, భారతి ఎయిర్టెల్ వంటి దేశీయ టెలికమ్యూనికేషన్ సంస్థలు అనేక సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. విస్తృతమైన భూగర్భ లేదా భూభాగ ఆధారిత మౌలిక సదుపాయాలు లేకుండానే ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను అందించగలగడం వల్ల, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో భారతీయ టెలికాం సంస్థలకు పోటీ పెరగవచ్చు. స్పెక్ట్రమ్ ఛార్జీలు, లైసెన్సింగ్ రుసుములు, నియంత్రణ నిబంధనల్లో వ్యత్యాసాలు ఉపగ్రహ ఇంటర్నెట్ సంస్థలకు, సంప్రదాయ టెలికాం సంస్థలకు మధ్య సమాన పోటీ వాతావరణంపై ఆందోళనలను కలిగించవచ్చు. సున్నితమైన సమాచారాన్ని రక్షించడానికి డేటా భద్రత, చట్టబద్ధమైన సమాచార నిఘా, జాతీయ భద్రతలకు అనుగుణంగా సేవల నిర్వహణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి. పోటీలో నిలదొక్కుకోవడానికి భారతీయ సంస్థలు ఉపగ్రహ సాంకేతికతలో పెట్టుబడులు పెంచడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం, వినూత్న ధరల విధానాలను అవలంబించడం ద్వారా దేశ వ్యాప్తంగా అందుబాటు ధరల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించాల్సి ఉంటుంది.

ఇలాన్ మస్క్, ముకేష్ అంబానీ మరియు భారత ప్రభుత్వం మధ్య స్టార్‌లింక్ వివాదానికి అత్యుత్తమ పరిష్కారం పారదర్శకమైన, నిష్పాక్షికమైన మరియు సాంకేతికత పట్ల తటస్థమైన శాటిలైట్ ఇంటర్నెట్ విధానాన్ని ఏర్పాటు చేయడమే. శాటిలైట్ లైసెన్సులు, భద్రతా అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపులు, వాణిజ్య కార్యకలాపాల కోసం ప్రభుత్వం స్పష్టమైన సమయ పరిమితులను ప్రచురించాలి. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్, సాంప్రదాయ టెలికామ్ సేవల మధ్య ఉన్న సాంకేతిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకునే పారదర్శకమైన, ఆధారపడదగిన సూత్రం ద్వారా స్పెక్ట్రమ్ ధరలను నిర్ణయించాలి. మస్క్ యొక్క స్టార్‌లింక్, అంబానీ యొక్క రిలయన్స్ జియో, ఇతర ఆపరేటర్లందరూ భద్రత, డేటారక్షణ, వినియోగదారుల రక్షణ, చట్టబద్ధమైన సమాచార నిఘా, నిబంధనలను ఒకే రీతిలో పాటించాలి. బహిరంగ వివాదాలు లేకుండా అభిప్రాయభేదాలను పరిష్కరించుకోవడానికి శాటిలైట్ ఆపరేటర్లు, టెలికామ్ కంపెనీలు, 'ట్రాయ్', టెలికమ్యూనికేషన్ల శాఖల మధ్య చర్చలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. నిబంధనల వెసులుబాట్ల కంటే సేవ నాణ్యత, సరసమైన ధరలు, ఆవిష్కరణలు, గ్రామీణ కనెక్టివిటీ ద్వారా శాటిలైట్ కంపెనీలు, టెలికామ్ ఆపరేటర్లు పోటీ పడాలి. సుదూర గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రకృతి వైపరీత్యాల ప్రమాదం ఉన్న ప్రాంతాలకు ఇంటర్నెట్ అందించడానికి ప్రభుత్వం కొలవగల గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ లక్ష్యాలను, ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టవచ్చు.

అంతిమంగా, ఊహించ దగిన క్రమబద్ధమైన నిబంధనలు, సమానమైన పోటీ వాతావరణం, జాతీయ భద్రతా రక్షణ చర్యలు పెట్టుబడులు, ఆవిష్కరణలు, సరసమైన ఇంటర్నెట్ లభ్యతను ప్రోత్సహిస్తూనే భారతదేశ ప్రయోజనాలను కాపాడగలవు.

**- కిరణ్ శ్రీ**
8125695799

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

**ఐదేళ్ల విరామానికి తెర.. షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా!**

**కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని పిలుపు.**

**కామారెడ్డిలో 36 ఏళ్ల దసరా ఉత్సవాల సంప్రదాయానికి అండగా షబ్బీర్ అలీ ఫౌండేషన్.**



**కామారెడ్డి, అక్టోబర్ 21 (మనం న్యూస్);** ఐదేళ్ల విరామం తర్వాత కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలకు మళ్లీ వైభవం సంతరించుకుంది. షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల మధ్య మతసామరస్యం, సోదరభావం, ఐక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

**36 ఏళ్ల సంప్రదాయానికి మళ్లీ ఊపిరి.**

కామారెడ్డి పట్టణంలో దాదాపు 36 ఏళ్లుగా షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు నిర్వహిస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రజలందరూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపై కలుసుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ప్రభావం, ఇతర పరిస్థితుల కారణంగా గత ఐదేళ్లుగా ఉత్సవాలను నిర్వహించలేకపోయామని చెప్పారు. ఇన్నాళ్ల విరామం తర్వాత మళ్లీ ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, సహకారం ఈ కార్యక్రమాల నిర్వహణకు ప్రధాన బలమని పేర్కొన్నారు.

**ప్రజల ఐక్యతే లక్ష్యంగా ఉత్సవాల పునఃప్రారంభం.**

దసరా వేడుకలను కేవలం పండుగ సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజంలో ఐక్యతను చాటే వేదికగా నిర్వహించాలన్నదే తమ ఉద్దేశమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. పండుగలు ప్రజలను దగ్గర చేస్తాయని, పరస్పర గౌరవం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన గంగా జమునా తెహజీబ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం సమాజానికి గర్వకారణమని వివరించారు.

**చెడుపై మంచి విజయమే విజయదశమి.**

విజయదశమి చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని షబ్బీర్ అలీ అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, విశ్వాసం, న్యాయం పట్ల నిబద్ధతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి.**

విజయదశమి సందర్భంగా అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.

**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి.**

కామారెడ్డి పట్టణ ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తూ మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఐక్యత, మతసామరస్యం, సంప్రదాయ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఐదేళ్ల విరామం తర్వాత నిర్వహించిన ఈ విజయదశమి వేడుకలు కామారెడ్డిలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

## పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి




**అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం.**

**కారుణ్య నియామకాలను వేగవంతం చేస్తాం.**

**కలెక్టర్ ఇలా త్రిపాఠి, సిపి సాయి చైతన్య.**

**నిజామాబాద్, అక్టోబర్ 21 (మనం బ్యూరో):** శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నిజామాబాద్ పోలీస్ హెడ్క్వార్టర్స్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటాయని, కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ., నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుంచి ఇప్పటివరకు 21 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. ఇప్పటికే 11 మంది అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించామని, మిగిలిన కుటుంబాలకు స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అమరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామని, పోలీసు అధికారులు వారి అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.

## సీఎం మాన్ను 3 గంటలు నిర్బంధించారు: ఆప్ ఆరోపణలు



**ఢిల్లీ, అక్టోబర్ 21 :** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పారిస్ వెళ్లి తిరిగొస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో మూడు గంటల సేపు అడ్డుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆరోపించింది. రూ.50వేలు చలానా విధించారని పేర్కొంది. మాన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, పదే పదే అడ్డంకులు సృష్టిస్తోందంటూ విమర్శలు గుప్పించింది. ఈ మేరకు ఆ పార్టీ మీడియా ఇన్ఛార్జి బల్తేజ్ పన్నూ మీడియాతో మాట్లాడారు. 'మీ లగేజీ వస్తోంది. చెక్ చేస్తున్నాం' అంటూ మాన్ను కావాలనే విమానాశ్రయంలో ఆపారు. దాదాపు మూడు గంటల పాటు నిర్బంధించారు. తీరా లగేజీ వాహనంలో పెట్టుకుని వెళ్తుండగా ఓ అధికారి పరిగెత్తుకుంటూ వచ్చి రూ.50వేలు చలానా విధించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఇలా విమానాశ్రయంలో నిర్బంధించి, రూ.50వేలు చలానా విధించి అవమానిస్తారా?'' అని పన్నూ ప్రశ్నించారు.అయితే, చలానా ఎందుకు విధించారనే దానిపై ఆప్ స్పష్టత ఇవ్వలేదు. పారిస్ 2026 ఫుడ్ ఎగ్జిబిషన్లో పంజాబ్ ఉత్పత్తులను ప్రమోట్ చేయడానికి మాన్ వెళ్లేందుకు కూడా కేంద్రం అనుమతి నిరాకరించిందని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ఎక్స్లో పోస్ట్ పెట్టారు. చివరికి హైకోర్టు జోక్యంతో వెళ్లారని పేర్కొన్నారు. మరోవైపు ఇదే అంశంపై శిరోమణి అకాలీ దళ్ నేత బిక్రం సింగ్ మజితియా మాట్లాడారు. పరిమితికి మించి అనుమతి లేకుండా డబ్బు లేదా లగేజీ తీసుకెళ్లారనే కారణంతోనే కస్టమ్స్ అధికారులు మాన్, ఆయన భార్య గుర్ ప్రీత్ కౌర్ ను దాదాపు మూడు గంటలు పాటు ఆపారని పేర్కొన్నారు. మాన్ ముఖ్యమంత్రి హోదాలో ఉండడంతో విడిచిపెట్టారని ఆయన తెలిపారు.

## వాయు కాలుష్యం ఎఫెక్ట్
# మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ




**ఢిల్లీ, అక్టోబర్ 21 :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ పడగ విప్పుతోంది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ దిగజారడంతో 'సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్ ' ఈ సీజన్లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ - ఎన్సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-1 నిబంధనలను తక్షణమే అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సీఏక్యూఎం ఛైర్ పర్సన్ రాజేశ్ వర్మ అధ్యక్షతన ఢిల్లీ ఉన్నతాధికారులు, పలు ప్రభుత్వ ఏజెన్సీలతో సమీక్షా సమావేశం జరిగింది. నగరంలో వాయు కాలుష్య సమస్యలను సమీక్షించడంతో పాటు రాబోయే రోజుల్లో కాలుష్య నివారణ చర్యల్ని బలోపేతం చేయడంపై చర్చించారు.

ఢిల్లీలో ఈ నెల 20న వాయు నాణ్యత సూచీ 179గా (మధ్యస్థ కేటగిరీ) నమోదు కాగా.. బుధవారం మధ్యాహ్నం 2గంటలకు 244 (పూర్ కేటగిరీ)కి ఒక్కసారిగా పెరిగిందని సీఏక్యూఎం ఓ ప్రకటనలో పేర్కొంది. రాబోయే రోజుల్లో వాయు నాణ్యత సూచీ 'పూర్' కేటగిరీలోనే ఉంటుందని భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు అంచనా వేసినట్లు తెలిపింది. వాయు నాణ్యత మరింతగా క్షీణించకుండా నిరోధించేందుకు జీఆర్ఏపీ-1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రాప్-1 కింద హోటళ్లు, రెస్టారంట్లలో ఇంధనంగా బొగ్గు, వంట చెరకు వినియోగం నిషేధం, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డీజిల్ జనరేటర్ల వాడకానికి అనుమతించడం వంటి ఆంక్షలను అమలు చేస్తున్నట్లు పేర్కొంది.



## వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు

- **ఇరాన్ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ**

**టెహ్రాన్, అక్టోబర్ 21 :** పశ్చిమాసియాలో ఘర్షణలు ముగించేలా అమెరికా.. ఇరాన్ మధ్య పాకిస్థాన్ రాయబారం కొనసాగిస్తూనే ఉంది. సంధిపై ముందుకెళ్లే క్రమంలో తమ షరతులను పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్కు ఇరాన్ స్పష్టంగా చెప్పింది. తాము శుద్ధి చేసిన యురేనియాన్ని వేరే దేశానికి తరలించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

''శుద్ధి చేసిన యురేనియంలో ఒక్క గ్రాము కూడా ఇరాన్ నుంచి బయటకు వెళ్లదు. మాకు నమ్మకం కుదిరేలా అమెరికా చర్యలు తీసుకునే వరకు ఎలాంటి చర్చలు ఉండవు. ఇరాన్ విధించిన అన్ని షరతులను నెరవేర్చడంతోనే ఆ చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలి'' అని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ ఎక్స్లో పోస్టు పెట్టారు. మధ్యవర్తిత్వం కోసం ఇరాన్ వెళ్లిన జనరల్ మునీర్కు మొహసెన్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు.

అప్పటి వరకు హర్మూజ్ మూసే ఉంటుంది..

''హర్మూజ్ జలసంధి విషయంలో ఎలాంటి గందరగోళ వైఖరి లేదు. అమెరికా మా షరతులు అంగీకరించేంత వరకు హర్మూజ్ మూసే ఉంటుంది. ఇప్పటికే వెళ్తున్న మార్గాల్లో ఓడలకు సమస్యలు ఎదురవుతాయి. గత హామీలను అమెరికా గౌరవించేవరకు కొత్తగా చర్చలు ఏమీ ఉండవు'' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఓ ఇంటర్వ్యూలో పునరుద్ఘాటించారు.

# ఫ్రాన్స్ అల్లర్లలో అమెరికా తీవ్రవాదులు



**పారిస్, అక్టోబర్ 21 :** ధరల పెరుగుదల, దుర్భరమైన జీవన వ్యయం వంటి సమస్యలపై నిరసన ప్రదర్శనల సందర్భంగా ఫ్రాన్స్లోని సిటీ హాళ్లు, ఇతర ప్రభుత్వ భవనాలు, వేలాది వాణిజ్య సంస్థలపై ఉద్యమకారులు దాడులకు పాల్పడుతున్నారు. దీంతో అక్కడి ప్రభుత్వం కర్ఫ్యూలు విధించాల్సి వచ్చింది. అయినప్పటికీ అల్లర్లు ఆగట్లేదు. తీవ్రమవుతున్న ఈ ఆందోళనల్లో చేరడానికి అమెరికా నుంచి కొంతమంది యాక్టివిస్టులు, తీవ్రవాద భావజాలం ఉన్న వ్యక్తులు పారిస్కు వెళ్లినట్లు అగ్ర రాజ్యానికి చెందిన మీడియా సంస్థలు సంచలన కథనాలను వెలువరించాయి. వాటి ప్రకారం.. అల్లర్లలో పాల్గొనడానికి మిన్నెసోటా నుంచి ఓ ర్యాపర్ ఇటీవల ఫ్రాన్స్కు వెళ్లారు. అంతటితో ఆగకుండా పారిస్లో బీభత్సం సృష్టించాలని సోషల్ మీడియా వేదికగా శ్వేత జాతీయులకు పిలుపునిచ్చారు. అమెరికాలోనూ ఇటువంటి నిరసనలు లేవనెత్తాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన కోడ్ పింక్ అనే సంస్థ ఫ్రాన్స్ను ఆదర్శంగా తీసుకొని అగ్ర రాజ్యంలోనూ ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. నవంబర్ 10 నుంచి 12 మధ్య వాషింగ్టన్లో 'పన్ను చెల్లింపుదారుల తిరుగుబాటు' నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఫ్రాన్స్లో నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో వారాంతంలో దేశవ్యాప్తంగా సుమారు 2,500 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా దాడుల్లో దాదాపు 1,000 మంది అధికారులు గాయపడినట్లు తెలిపారు. అల్లర్లపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాట్లాడుతూ.. తమ దేశంలో నెలకొన్న హింసకు తీవ్రవాద వామపక్ష బృందాలకు చెందిన తిరుగుబాటుదారులు, నేరగాళ్లు కారణమని ఆరోపించారు. ఫ్రాన్స్లో నిరసనలకు వలసదారులే కారణమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించిన నేపథ్యంలో మేక్రాన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# పారిస్లో లగ్జరీ స్టోర్ల లూటీ..
## సెకండ్హ్యాండ్ మార్కెట్లో అమ్మకం..!



**పారిస్, అక్టోబర్ 21 :** ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్లో వందల సంఖ్యలో దుకాణాలను, షోరూమ్లను అల్లరి మూకలు దోచుకొన్నాయి. దోచుకొన్న ఆ వస్తువులను అల్లరి మూకలు ఆన్లైన్ సెకండ్ హ్యాండ్ మార్కెట్లో విక్రయానికి పెట్టాయి. ఫ్రెంచి రీటైల్ అండ్ ట్రేడ్ ఫెడరేషన్ అంచనా ప్రకారం ఫ్రాన్స్లో ఈ ఆందోళనల వేళ సుమారు 1500 దుకాణాలు లూటీకి గురయ్యాయి. వీటిల్లో లగ్జరీ బ్రాండ్లయిన లూయిస్ విటాన్, ఎర్మెస్, రోలెక్స్, యాపిల్, సెలిన్ సెఫోరా, బర్బెర్రీ షోరూమ్లు కూడా ఉన్నాయి.

లగ్జరీ డిజైనర్ బ్యాగ్లు, వాచ్లు, ఫోన్లు ఫ్రాన్స్లోని ప్రఖ్యాత ఆన్లైన్ సెకండ్హ్యాండ్ వెబ్సైట్ వింటెడ్లో అమ్మకానికి దర్శనమిచ్చాయి. ఈ విషయాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం కూడా గుర్తించింది. సాధారణంగా ఫ్రాన్స్లోని డిజైనర్ వస్తువులు విక్రయించే రియల్ రియల్ వంటి వెబ్సైట్లలో లగ్జరీ వస్తువులను సెకండ్హ్యాండ్ మార్కెట్లో విక్రయానికి పెట్టినప్పుడు వాటిని నిపుణులు పరిశీలించి ధ్రువీకరిస్తారు. కానీ, వింటెడ్లో మాత్రం అమ్మకానికి ఉంచిన వ్యక్తి నేరుగా దానిని కొనుగోలుదారుడికి విక్రయించేలా (పీర్ టూ పీర్) అవకాశం ఉంది. దీంతో ఫ్రాన్స్లో అత్యధిక కస్టమర్ బేస్ ఉన్న వెబ్సైట్ ఇదే. ఈ అంశం అల్లరి మూకలకు అనువుగా మారింది.

ఈ వ్యవహారంపై ఫ్రాన్స్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆ దేశ డిజిటల్ మినిస్టర్ అన్నె లెహన్నాఫ్ స్పందిస్తూ.. ''దోచుకొన్న లగ్జరీ వస్తువులను కొన్ని ఆన్లైన్ ప్లాట్ఫామ్లో విక్రయిస్తున్నారు. అలాంటి చర్యలను చూస్తూ ఊరుకోం. ఈ ప్లాట్ఫామ్లే స్వచ్ఛందగా అటువంటి అనుమానాస్పద వస్తువులను తమ వేదికల నుంచి తొలగించాలి. వీటిని విక్రయించే వారిని పట్టుకొని శిక్షించేందుకు ఆన్లైన్ వేదికలు ప్రభుత్వానికి సహకరించాలి'' అని హెచ్చరించారు. దీనికి వింటెడ్ కూడా స్పందించింది. తాము అటువంటి వస్తువులను తొలగిస్తున్నామని పేర్కొంది. అల్లరి మూకల నుంచి తమ స్టోర్లను కాపాడుకోవడానికి డియోర్ సంస్థ ఏకంగా ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీని నియమించుకొంది. ఫ్రాన్స్లో అల్లర్ల వ్యాప్తిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. ప్రస్తుత అల్లర్లకు వలసలే కారణమని నిందించారు. ప్రపంచం మొత్తం నుంచి జనాభాను ఫ్రాన్స్కు తీసుకురావడం ఓ తప్పని మేక్రాన్ను తాను చాలా కాలం క్రితమే హెచ్చరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్లో అల్లర్లకు స్కూళ్లతో సంబంధం లేదని ట్రంప్ పేర్కొన్నారు. అతి త్వరలోనే పారిస్ ముస్లిం నగరంగా మారిపోతుందని వ్యాఖ్యానించారు.

## శత్రుడ్రోన్లకు చెక్పెట్టేలా...
### ఉక్రెయిన్ కొత్త ఆయుధం!



**కీవ్, అక్టోబర్ 21 :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్న విషయం మనందరికి తెలిసిందే. అయితే, శత్రుదేశాల డ్రోన్లను సమర్థంగా అడ్డుకునేందుకు ఉక్రెయిన్కు చెందిన బ్లూబర్డ్ టెక్ సంస్థ కొత్త ఆయుధాన్ని తయారు చేసింది. శత్రువుల దాడి జరిగినప్పుడు, ఎటువంటి ఆయుధం అందుబాటులో లేనప్పుడు, అత్యవసర సమయాల్లో ప్రాణరక్షణకు ఉపయోగపడేలా 'యాంటీ-డ్రోన్ నెట్ లాంచర్'ను అభివృద్ధి చేశారు. సరిహద్దుల్లోని సాధారణ పౌరుల భద్రతకు ఈ ఆవిష్కరణను అందుబాటులోకి తెచ్చారు

## వలసలపై ట్రంప్ ఉక్కు పాదం..
# 3 లక్షల వీసాల రద్దు




**వాషింగ్టన్, అక్టోబర్ 21 :** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కు పాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్.. వీసాల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో రెండోసారి అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆయన సుమారు మూడు లక్షల వీసాలను రద్దు చేసినట్లు తెలిసింది. వీటిలో 'బర్త్ టూరిజం' కోసం వచ్చినవారివే ఎక్కువ ఉన్నాయి. అలాంటి చర్యలకు సహకరించారని ఆరోపణలు ఉన్నవారికి సంబంధించిన నాలుగు వేల వీసాలూ అందులో ఉన్నట్లు సమాచారం.

మిగిలిన వారు హింస, ప్రజా భద్రతకు ముప్పు, మోసం, తప్పుడు సమాచార వ్యాప్తి, మద్యం తాగి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినట్లుగా స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వాటిని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగాట్ ధ్రువీకరించారు. అయితే, రద్దు చేసిన వీసాదారుల్లో ఏ దేశీయులు ఎక్కువ మంది ఉన్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. చరిత్రలో మరే అధ్యక్షుడు చేయని విధంగా ట్రంప్ అత్యధిక వీసాలు రద్దు చేసినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. అమెరికాలో ఉంటూ చట్టాన్ని ఉల్లంఘించేలా, జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించే విదేశీ పౌరులపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మొత్తం రద్దయిన మూడు లక్షల వీసాల్లో రెండున్నర లక్షలు గతేడాది జనవరిలో రద్దు చేసినట్లు తెలిపారు.

గతేడాది జనవరిలో ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం అక్రమ వలసదారులను వెనక్కి పంపించే కార్యక్రమం చేపట్టారు. దీంతోపాటు సోషల్ మీడియా వెట్టింగ్ (వీసా జారీ చేయడానికి ముందు అభ్యర్థి సోషల్ మీడియా ఖాతాలన్నీ పరిశీలించడం)తో పాటు స్క్రీనింగ్ను విస్తృతం చేశారు. స్థానిక చట్టాలను ఉల్లంఘించే వారి వీసాల రద్దును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే వీసాల రద్దు గతంతో పోలిస్తే రెట్టింపు అయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉండటం, స్థానిక చట్టాలను ఉల్లంఘించడం లాంటి పనులు చేస్తున్న విదేశీ విద్యార్థులపైనా ట్రంప్ యంత్రాంగం నిఘా పెట్టింది.

## మస్క్ ఆదేశాలతోనే ఉక్రెయిన్కు 'స్టార్లింక్' షాక్

**వాషింగ్టన్, అక్టోబర్ 21 :** భారత్లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించాలని తహతహలాడుతున్న స్టార్లింక్ అధిపతి ఎలాన్ మస్క్కు సంబంధించి సంచలన విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. స్టార్లింక్ ఉపగ్రహ నెట్వర్క్ నెమ్మదించడం వల్లే ఇటీవల ఉక్రెయిన్లో డ్రోన్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సందర్భంలో నెట్వర్క్ వేగాన్ని తగ్గించాల్సిందిగా మస్క్ స్వయంగా ఆదేశించినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం పేర్కొంది. ఈ మేరకు ఇద్దరు అమెరికా అధికారులు, సంబంధిత వర్గాలను ఉటంకించింది. ఉద్దేశపూర్వకంగా నెట్వర్క్ వేగాన్ని తగ్గించాలని మస్క్ ఆదేశించారని, ఆ నిర్ణయం ఉక్రెయిన్లో ఆందోళన రేకెత్తించిందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఇదంతా అమెరికా యంత్రాంగాన్ని అయోమయానికి గురిచేసిందని పేర్కొన్నాయి. ఇటీవల రష్యాతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డీజిల్ ఒప్పందం కుదుర్చుకున్న సమయంలోనే యుద్ధ రంగంలో ఉక్రెయిన్ డ్రోన్లు వేగాన్ని కోల్పోయాయి. అమెరికా మద్దతు సన్నగిల్లడంతో రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ వాడుతున్న స్టార్లింక్ కమ్యూనికేషన్ పరికరాలపై మస్క్ నియంత్రణలు విధించినట్లు వార్తలు రాగా.. వాటిని ఆయన అప్పుడు తోసిపుచ్చారు. స్టార్ షీల్డ్ (సైనిక అవసరాల కోసం ఉపయోగించే స్టార్లింక్) అమెరికా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుందని నాడు మస్క్ వివరణ ఇచ్చారు. స్టార్లింక్ సేవల కోత విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదని యూఎస్ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇప్పటికే స్పష్టం చేశారు. ''సేవల వేగం విషయంలో మేం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఉక్రెయిన్ విజయం సాధించాలని మేం కోరుకుంటున్నాం'' అని వివరణ ఇచ్చారు.

## కిమ్ కోమాలో ఉన్నారంటూ వార్తలు..
### ఫొటోలతో చెక్ పెట్టిన ఉత్తర కొరియా



**ప్యాంగాంగ్, అక్టోబర్ 21 :** ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తీవ్ర అనారోగ్యంతో చైనాలో చికిత్స పొందుతున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఆయన కోమాలో ఉన్నారని పేర్కొన్నాయి. మరోవైపు కిమ్ అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారని.. ఆయన సోదరి కిమ్ యో జోంగ్ ఉత్తర కొరియాను తన అధీనంలోకి తీసుకున్నారని చైనా అసమ్మతివాది వాంజున్ షీ సోషల్ మీడియాలో వరుస పోస్టులు చేశారు. అందువల్లే ఆయన కొంతకాలంగా బహిరంగగా కనిపించట్లేదన్నారు. దీంతో కిమ్ ఆరోగ్యంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ వార్తలకు ఉత్తరకొరియా ప్రభుత్వ మీడియా కిమ్ ఫొటోలతో చెక్ పెట్టింది. అందులో కిమ్ తన కుమార్తెతో కలిసి షాపింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సోమవారం(రెండురోజుల క్రితం) వారు షాపింగ్కు వెళ్లిన సమయంలో ఈ ఫొటోలు తీసినట్లు తెలుస్తోంది.




## తాడేపల్లిగూడెంలో కలెక్టర్ నాగరాణి తనిఖీ !



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 21 (మనం న్యూస్):** పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోందని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు.బుధవారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో, మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు 7,500 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆర్డీవో ఎం సూర్యారావు , ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరిబాబు , ఎంపీడీవో చంద్రశేఖర్ , తాసిల్దార్ సునీల్ కుమార్ , ఎన్నికల అధికారులు అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీటిసి అభ్యర్థిగా నాగ వెంకటలక్ష్మి నామినేషన్



**నరసాపురం, అక్టోబర్ 21 (మనం న్యూస్) :** నరసాపురం మండల జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా కూనపరెడ్డి నాగ వెంకటలక్ష్మి బుధవారం భీమవరం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీకి నామినేషన్ పత్రాలు అందజేశారు. నరసాపురం మండలం యర్రంశెట్టివారిపాలెం గ్రామ మాజీ సర్పంచ్, రైతు, ప్రజా సమస్యల పోరాట నాయకుడు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు కుమార్తె అయిన నాగ వెంకటలక్ష్మి రాజకీయాల పట్ల అవగాహన కలిగి ఉన్న ఉన్నత విద్యావంతురాలు. ఎమ్మెస్సీ పూర్తి చేసిన నాగ వెంకటలక్ష్మి సేవాభావం ఉన్న కుటుంబం నుండి రాజకీయాలలోకి వచ్చారని ఆమెను పార్టీలకు అతీతంగా ప్రజలు ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి తమ అమూల్యమైన ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని నాగ వెంకటలక్ష్మి తండ్రి కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలి



- ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి, ఎంపీ భాష్యం రామకృష్ణ

**నరసాపురం, అక్టోబర్ 21 (మనం న్యూస్) :** మునిసిపల్ మరియు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుధవారం నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్, పంచాయితీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘనవిజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలు, ప్రచార కార్యాచరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేసి మున్సిపల్ చైర్పర్సన్, వార్డు కౌన్సిలర్లతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పాలకొల్లులో గెలుపు గుర్రాల ఎంపికపై

# మంత్రి నిమ్మల ప్రత్యేక కసరత్తు

**సామాజిక సమీకరణలు.. కూటమి ధర్మం.. గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక**



**పాలకొల్లు, అక్టోబర్ 21,మనం ప్రతినిధి :** జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాలకొల్లు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆచితూచి వ్యవహరించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, పొత్తు ధర్మం, గ్రామస్థాయి నాయకుల అభిప్రాయాలు, అభ్యర్థుల ప్రజాబలాన్ని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. రాత్రింబవళ్లు సమాలోచనలు జరిపి, అన్ని కోణాల్లోనూ విశ్లేషించిన అనంతరం అభ్యర్థుల ఎంపికకు తుది రూపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య ఐక్యతే విజయానికి పునాది కావాలన్న లక్ష్యంతో మంత్రి నిమ్మల రామానాయుడు ముందుకు సాగుతున్నారు. టీడీపీ, జనసేన, బిజెపి తో పాటు కూటమి నేతలతో పలుమార్లు చర్చలు జరిపి, ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఖరారు చేసే దిశగా చర్యలు చేపట్టారు. ఎక్కడా పొత్తు ధర్మానికి విఘాతం కలగకుండా, భాగస్వామ్య పార్టీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ నిర్ణయాలు తీసుకోవడంపై దృష్టి సారించారు. వ్యక్తిగత అభిప్రాయాల కంటే కూటమి ప్రయోజనాలు, పార్టీ విజయావకాశాలకే ప్రాధాన్యమిచ్చేలా ఎంపిక ప్రక్రియను కొనసాగించారు.

పాలకొల్లు, ఎలమంచిలి, పోడూరు మండలాల పరిధిలో జడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీటీసీ స్థానాల వారీగా అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి ఖరార్ చేశారు. గ్రామాల్లో పార్టీ పరిస్థితి, నాయకుల మధ్య సమన్వయం, ప్రజల్లో అభ్యర్థులకు ఉన్న ఆదరణ, స్థానిక రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకున్నారు. గ్రామస్థాయి టీడీపీ శ్రేణుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు కూటమి నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో అభ్యర్థుల ఎంపికను కేవలం నాయకుల నిర్ణయానికే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా చేపట్టినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

**జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు వీరే..**

పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని మూడు జడ్పీటీసీ స్థానాలకు కూటమి తరపున అభ్యర్థులను ఖరారు చేశారు.

పాలకొల్లు: టీడీపీ నుంచి మేడిది ఉషారాణి

ఎలమంచిలి: జనసేన నుంచి కొడవటి నాగలక్ష్మి

పోడూరు: టీడీపీ నుంచి దాసరి మిస్సమ్మ

పార్టీల మధ్య సమన్వయాన్ని ప్రతిబింబించేలా పాలకొల్లు, పోడూరు స్థానాల్లో టీడీపీకి, ఎలమంచిలి స్థానంలో జనసేనకు అవకాశం కల్పించడం కూటమి ఐక్యతకు ప్రాధాన్యమిచ్చిన నిర్ణయంగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

₹ఎంపీపీ పదవుల విషయంలోనూ సమన్వయ వ్యూహం₹

ఎంపీపీ పదవుల విషయంలోనూ మంత్రి నిమ్మల రామానాయుడు సమన్వయ ధోరణిని అనుసరించారు.

పాలకొల్లు ఎంపీపీగా అంగర వీరభద్ర కుమార్ను ఎంపిక చేయగా, ఎలమంచిలి ఎంపీపీ పదవికి పీతల శ్రీనివాస్, తాళ్ల నాగరాజులకు చెరో రెండున్నర సంవత్సరాల చొప్పున అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. పదవుల పంపిణీలో సమతుల్యత పాటించడం ద్వారా కూటమి నేతల మధ్య ఐక్యతను కొనసాగించడంతో పాటు భవిష్యత్తులో విభేదాలకు తావు లేకుండా చూడాలన్న ప్రయత్నం కనిపిస్తోంది.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కివ్వాక, మారేడుబాక గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**కుక్కునూరు, అక్టోబర్ 21 ( మనం న్యూస్ ):** ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు కుక్కునూరు మండలంలోని కివ్వాక,మారేడుబాక గ్రామాల్లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. కుక్కునూరు మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో పాటు గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న నేపథ్యంలో, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు అధికారులు మరియు జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బంది ఈ ఫ్లాగ్ మార్చ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించి, ప్రజలకు భద్రతాభావాన్ని కల్పించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసు నిఘా మరియు భద్రతా చర్యలు కొనసాగుతాయి. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

## పోడూరులో ఊపందుకున్న ఎంపీటీసీ నామినేషన్ల పర్వం!



- వైసీపీ, టీడీపీ, జనసేన నుంచి 10 మంది అభ్యర్థుల నామినేషన్లు

**పోడూరు అక్టోబరు 21, మనం ప్రతినిధి:** పోడూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 10 మంది ప్రధాన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల నుంచి అభ్యర్థులు బరిలోకి దిగుతూ తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

పోడూరు-1 జనరల్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా రుద్రరాజు వెంకట్రామరాజు నామినేషన్ దాఖలు చేయగా, పండితల్లూరు ఎస్సీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పుట్ల బాల సుబ్రహ్మణ్యం, తూర్పుపాలెం ఎస్సీ స్థానం నుంచి బులిరాజు మూడే నామినేషన్లు వేశారు. గుమ్మలూరు ఎస్సీ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా రావి హరీష్ బాబు, అదే గ్రామంలోని బీసీ మహిళా స్థానానికి టీడీపీ అభ్యర్థిగా వేండ్ర ధనలక్ష్మి నామినేషన్ సమర్పించారు.

వేడంగి-2 జనరల్ మహిళా స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా బళ్ళ బుల్లమ్మ, వేడంగి-1 ఎస్సీ మహిళా స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా యడ్ల మహాలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. పెనుమదం బీసీ మహిళా స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా అరుణదేవి చోరపల్లి, ఎస్సీ మహిళా స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా యార్లగడ్డ దివ్య నామినేషన్లు సమర్పించారు.

కొమ్ముచిక్కాల జనరల్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా కుచ్చర్లపాటి కొండరాజు నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. రానున్న రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ మరింత వేడెక్కే అవకాశం ఉంది.

## వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**బేతంచేర్ల అక్టోబర్ 21 (మనం న్యూస్):** పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం వారి ఆహ్వానం మేరకు అమ్మవారిశాల ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ బేతంచర్ల నగర పంచాయతీ కూటమి చైర్మన్ అభ్యర్థి లోకేష్ గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో గత రెండేళ్లుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేశానని తెలిపారు పట్టణ ప్రజలకు వ్యాపారస్తులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారుబేతంచర్ల పట్టణం మరింత అభివృద్ధి చెందాలన్నా ప్రజలు మరియు వ్యాపారస్తులు సంతోషంగా ఉండాలన్నా కూటమి పాలన కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు పట్టణ అభివృద్ధి ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు.కుని కూటమి చైర్మన్ అభ్యర్థి శ్రీ లోకేష్ గౌడ్ తో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు ప్రజలు ఆర్యవైశ్య సంఘం వారు మరోసారి మద్దతు తెలిపి ఆశీర్వదించాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పాలకొల్లు నియోజకవర్గం జడ్పీటిసి, ఎంపీపీ అభ్యర్థులు ఖరారు

- పేర్లు ప్రకటించిన మంత్రి నిమ్మల



**పాలకొల్లు, అక్టోబర్ 21,మనం ప్రతినిధి:** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం లోని పాలకొల్లు మండలం, ఎలమంచిలి మండలం, పోడూరు మండలం జడ్పీటిసి, ఎంపీపీ అభ్యర్థులను ఏపీ రాష్ట్ర జలవనరు ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం ఖరారు చేశారు.

పాలకొల్లు జడ్పీటిసి అభ్యర్థిని గా మేడిది ఉషారాణి,పోడూరు మండలం జడ్పీటిసి అభ్యర్థిని గా దాసరి మిస్సమ్మ, పాలకొల్లు మండలం ఎంపీపీ అభ్యర్థి గా అంగర వీరభద్ర కుమార్, ఎలమంచిలి మండలం ఎంపీపీ అభ్యర్థులుగా పీతల శ్రీనివాస్, తాళ్ల నాగరాజులను మంత్రి నిమ్మల ఖరారు చేసి ప్రకటించారు.

### విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు



**అమలాపురం.అక్టోబర్ 21 మనం ప్రతినిధి:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా,అమలాపురం పోలీస్ గ్రౌండ్ నందు అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తో కలిసి అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. తొలుత పెరేడ్ కమాండర్ ఆర్ఐ యన్.బ్రహ్మానందం ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించి స్వాగతం పలికారు. అనంతరం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీస్ సిబ్బంది వివరాలతో కూడిన సంస్మరణ పుస్తకాన్ని పుస్తక్ తొలి కమాండింగ్ తో తీసుకువచ్చి కలెక్టర్ కి అందజేయగా ఆ పుస్తకాన్ని ఎస్పీ తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ షేక్ షాభాజ్ అహ్మద్ ,ఏఆర్ డీఎస్పీ జి.యు.కె.ఎల్.వి. సుబ్బరాజు ,ఎస్బీ సీఐ పుల్లారావు ,సోషల్ మీడియా సిఐ శ్రీ తమ్మి నాయుడు ,రిజర్వ్ ఇన్స్పెక్టర్ల బ్రహ్మానందం , సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు,పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్ డి ఓ దాసిరాజు



**ఆచంట అక్టోబర్ 21 మనం న్యూస్:** నియోజకవర్గ కేంద్రమైన ఆచంట మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీటీసీ మరియు జెడ్పీటిసి రెండవ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల సేకరణ కేంద్రాన్ని బుధవారం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు పరిశీలించారు

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జడ్పీటిసి ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు మరియు అభ్యర్థిని బలపరిచేందుకు మరో ఇద్దరు వ్యక్తులకు మాత్రమే నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి ప్రవేశం ఉంటుందని తెలిపారు ఎన్నికల నిర్వహణ 2006 లోని 5వ నియమం ప్రకారం రిటర్నింగ్ అధికారి ఎంపిటిసి మరియు జడ్పిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుండి షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణమోహన్ తహసీల్దార్ ఎన్ సి హెచ్ ఎస్ ఎస్ ఎస్ కుమార్ మండల పరిషత్ పరిపాలన అధికారి వారా పూర్ణ బాబ్జి రెవెన్యూ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ మండల పరిధిలోని స్వర్ణ గ్రామపంచాయతీ కార్యదర్శులు స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మొదటి రోజు ఒకే నామినేషన్ దాఖలు



**గూడూరు, అక్టోబర్ 21 (మనం న్యూస్ ):** గూడూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో మొదటి రోజు ఒకే నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి బీ. కర్రెన్న తెలిపారు. గూడూరు మండలంలోని బూడిదపాడు గ్రామ ఎంపీటీసీ స్థానానికి అభ్యర్థి డి. సరస్వతి నామినేషన్ దాఖలు చేసినట్లు ఆయన వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి సరస్వతి, టీడీపీ మండలాధ్యక్షుడు సురేశ్తో పాటు రామాంజనేయులు, బ్రహ్మయ్య, బీజేపీ నాయకుడు రాజూభాయ్ తదితరులు నామినేషన్ కేంద్రానికి వచ్చారు.

మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల సందడి నెలకొంది. నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.




## మహానందిలో హైకోర్టు జడ్జి పూజలు



**మహానంది, అక్టోబర్21,మనంన్యూస్.** మహానంది పుణ్యక్షేత్రం లో అలహాబాద్ హైకోర్టు జడ్జి అచాయ్ సచ్ దేవ్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు.బుధవారం స్వామివారి దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ముఖమండపం వద్ద ఆలయ ఏ ఈఓ మధు, వేదపండితులు రవిశంకర్ అవధానిలు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితి ప్రకారం కళ్యాణ మండపంలో వేద మంత్రోత్సరణ మధ్య కండువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## శ్రీ మఠంలో దసరా వేడుకలు



- **జమ్మి చెట్టుకు పూజలు చేసిన పీఠాధిపతులు**

**మంత్రాలయం , అక్టోబర్ 21, మనం న్యూస్ :** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో విజయదశమి(దసరా) వేడుకలు పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయదశమి ని పురస్కరించుకుని పాత ఊరులోని వెంకటేశ్వరస్వామి దేవాలయం లో వెంకటేశ్వరస్వామికి పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం వెండి రథోత్సవం పై శ్రీనివాసుని ఆధిష్టించి ప్రత్యేక పూజలు చేసి భక్తులు హర్షధ్వానాలు మధ్య ప్రాకారం లో ఊరేగించారు. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవత మంచాలమ్మ దర్శించుకున్నారు. ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచా లమ్మను దర్శించుకొని ,మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. భక్తులకు పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. సాయంత్రం దసరా పండగ ను పురస్కరించుకుని మఠంలో ఉన్న జమ్మి చెట్టుకు పీఠాధిపతులు పూజలు చేసి జమ్మి గ్రామస్తులకు ఆందజేశారు. ఈ కార్యక్రమంలో మఠం అధికారులు , గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## టీడీపీలో మాజీ సర్పంచ్ బూదరు లక్ష్మీరెడ్డి చేరిక



**మంత్రాలయం , అక్టోబర్ 21,మనం న్యూస్ ;-** మండల పరిధిలోని బూదరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి , తమ్ముడు రాఘువ రెడ్డి , గౌతమ్ రెడ్డి టీడీపీ లో చేరారు. మంగళవారం మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో టీడీపీ ఇన్చార్జ్ రాఘువేంద్ర రెడ్డి ఆయనకు టీడీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపు కు కృషి చేస్తాన్ననారు. అనంతరం టీడీపీ ఇన్చార్జ్ రాఘువేంద్ర రెడ్డికి లక్ష్మీరెడ్డి శాలువా కప్పి , పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు అబ్రహం , దాసు , మోసే , రొగప్ప , ఈరన్న , జయన్న మాజీ సర్పంచ్ నాగరాజు , తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు



- **భారీ ఊరేగింపు అనంతరం అమ్మవారు నిమజ్జనం**
- **భారీ అన్నదానం**

**ప్రత్యేక పూజలు నిర్వహించాము ఎస్ రాంబాబు తెలిపారు**

**కొత్తపల్లి , సెప్టెంబర్ 21 (మనం న్యూస్)** యు కొత్తపల్లి మండలం అమీనాబాద్ పల్లెటూళ్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మరియు దసరా వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ ముగిశాయి. పట్టణాలకు దీటుగా పల్లెల్లో సైతం తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవి మండపాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. గత 15 సంవత్సరాల నుండి నవరాత్రి ఉత్సవాలు వీవర్స్ ఏరియాలో ఘనంగా నిర్వహిస్తున్నారు అయితే .ఈ సంవత్సరం అమ్మవారి దయవల్ల మా కుటుంబం అనుకున్నవన్నీ జరిగాయని ఈ సందర్భంగా మా సొంత నిధులతో నవరాత్రులకు దుర్గా దేవి అమ్మవారి విగ్రహం ప్రతిష్టించి శీలమంతుల రాంబాబు ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించామని రాంబాబు తెలిపారు. అదేవిధంగా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టమని ఈ తొమ్మిది రోజుల పాటు రాంబాబు కుటుంబ సభ్యులు ప్రతిరోజూ అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఉత్సవాల్లో భాగంగా నవమి రోజున శీలమంతుల రాంబాబు కుటుంబ సభ్యులు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజల ందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులు ఉత్సవాలను భక్తిపూర్వకంగా నిర్వహించారు. దశమి ఉత్సవాలు ముగింపుతో బుధవారం గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఊరేగించి ఘనంగా నిమజ్జనం చేశారు.

## రాఘవేంద్రుడ్ని సన్నిధిలో కలెక్టర్ సిరి



**మంత్రాలయం , అక్టోబర్ 20,మనం న్యూస్ ;-** విజయదశమిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి కుటుంబ సభ్యులతో మంగళవారం వచ్చారు. వారికి మఠం ఏ.ఏ.ఓ మాధవశెట్టి , మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , ప్రత్యేక పూజలు చేసి , మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ,మొక్కులు తీర్చుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు పట్టు చీర , ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వారి వెంట , మఠం అధికా రులు , ఎస్ఐ మల్లికార్జున , హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున , కానిస్టేబుల్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు

## తొలిరోజు ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు కాలేదు



**బేతంచేర్ల అక్టోబర్21 (మనం న్యూస్):** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు నామినేషన్ల స్వీకరణ సంబంధించి అధికారులు కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినప్పటికీ అభ్యర్థుల నుంచి ఎలాంటి నామినేషన్లు వెయ్యలేదు ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ బషీరున్నిసా బేగం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫజుల్ రహిమాన్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సునీల్ కుమార్ నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రానున్న రెండు రోజుల్లోనూ కొనసాగనుంది అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు

## భవానీ భక్తులకు ఘనంగా అల్పాహార పంపిణీ

### జర్నలిస్టు మురా రాజశేఖర్ ఆర్థిక సహకారం.. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**ఏలేశ్వరం, అక్టోబర్,21:-(మనం న్యూస్):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలేశ్వరం పట్టణంలోని చైతన్యనగర్ కాలనీలో మంగళవారం సాయంత్రం భవానీ భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో, జర్నలిస్టు మురా రాజశేఖర్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని దానాల కన్నా అన్నదానం అత్యంత పవిత్రమైనదని, మానవసేవే మాధవసేవ అనే భావనతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భవానీ భక్తుల సేవ కోసం ముందుకు వచ్చి ఆర్థిక



సహకారం అందించిన జర్నలిస్టు మురా రాజశేఖర్ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ఆయన కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు, భవానీ దీక్షాపరులు పాల్గొన్నారు.

# కర్నూలు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి

- **మంత్రి టీజీ భరత్**

**కర్నూలుఅక్టోబర్ 21(మనంన్యూస్):** కర్నూలు నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు నగరంలోని 4, 5వ వార్డుల్లో కూటమి మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూషతో కలిసి మంత్రి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల నుంచి వైసీపీకి మేయర్ అభ్యర్థి దొరకలేదా? అని ప్రశ్నించారు. వైసీపీ కార్పొరేటర్లు



గెలిచినా చేసేదేమీ లేదని విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీకి తెలుసని, ప్రజలకు మేలు చేయడం తెలియదని అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, నగర ప్రగతికి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలంటే కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కర్నూలు నగరంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా నగర అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో కర్నూలును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ప్రచారంలో 4వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుశీల భాయి, 5వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి ఉట్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నేత ప్రదీప్ రెడ్డి



**మంత్రాలయం ,అక్టోబర్ 21, మనం న్యూస్ :** విజయ దశమిని పురస్కరించుకుని మంత్రాలయం లోని రాఘువేంద్ర పురం లోని ప్రధాన రహదారి పై కొలువుదీరిన దుర్గా మాత అమ్మవారిని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఆయన కు శ్రీ భవానీ యూత్ సభ్యులు, వేద పండితులు తీర్థ ప్రసాదాలను అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. అదే విధంగా తాయమ్మ అవ్వకు, శ్రీ మల్లికార్జున స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. పూజారులు హోటల్ పరమేష్, వీరేష్ స్వామి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు. అనంతరం దుర్గా దేవి విగ్రహం ఏర్పాటు చేసిన శ్రీ భవానీ యూత్ రూ 20 వేలు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు మాజీ సర్పంచ్ భీమయ్య , మాజీ ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ , గోరుకల్లు కృష్ణ స్వామి, కురువ మల్లికార్జున, శివకుమార్, జ నార్దన్ రెడ్డి, వీకేసీ రాఘువేంద్ర, వీరారెడ్డి, బాలరాజు, రామాంజి, గాలెప్ప, మారెప్ప, వీరేష్, భీమ, సుంకన్న, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

# వైసీపీలో చేరిన టీడీపీ నాయకులు

**ఏలేశ్వరం,అక్టోబర్, 21:-(మనం న్యూస్ ):** ఏలేశ్వరం మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా 2, 3, 27, 28 వార్డుల నుండి బూడి సూరిబాబు, తుమ్మి విజయ్, యర్రంశెట్టి నాగబాబు, వీరబాబు, బంక రాజు, ఆటో యూనియన్ మాజీ ప్రెసిడెంట్ వసంత్ కుమార్, కొల్లి నాగేశ్వరావు, మాదేపల్లి దొరబాబు, ఇండియన్ రాజు తదితరులు టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. ఏలేశ్వరం మున్సిపాలిటీ వైసీపీ చైర్మన్ అభ్యర్థి బదిరెడ్డి ఆశలత గోవింద్, నాయకులు సిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్, పేకల జాన్, డేగల చంద్రమౌళి, జువ్విన వీర్రాజు, భజంతుల లక్ష్మణరావు, సిరిపురపు రాజేష్ తదితరుల ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ప్రత్తిపాడు వైసీపీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు సమక్షంలో పార్టీలో చేరిన నాయకులకు ఆయన వైసీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ఏలేశ్వరం మున్సిపాలిటీలో వైసీపీ జెండా ఎగురవేసేందుకు ఇప్పటికే పార్టీలో ఉన్న నాయకులు, పార్టీలో నూతనంగా చేరిన నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పార్టీలో నూతనంగా చేరిన నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయి వైసీపీలో చేరినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, పెన్షన్ల విషయంలోనూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఏలేశ్వరం మున్సిపాలిటీలో వైసీపీ విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దత్తి రాజా,లోగీసు శేఖర్, బీశెట్టి రాజా, గొడుగు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు..

## ప్రశాంతంగా సాగుతున్న నామినేషన్ దాఖలు




**జూపాడుబంగ్లా అక్టోబర్ 21 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని ఎంపీడీవో కార్యాలయం మొదటి రోజు అక్టోబర్ 21వ తారీకున ఎంపీటీసీ, జడ్పిటిసి, నామినేషన్ దాఖలు ప్రశాంతంగా జరిగాయి. జూపాడుబంగ్లా మండలం తుడిచర్లకు చెందిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ఎంపిటిసి అభ్యర్థిగా జూపాడు బంగ్లా ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, త్రాగునీరు, రహదారులు, విద్యా, వైద్యం, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు, నామినేషన్ సమయంలో నందికొట్కూరు రూరల్ సిఐ టి సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్సై మల్లికార్జున, 144 సెక్షన్ అమలు చేసి భారీ పోలీసు బందోబస్తుతో ఎంపిటిసి, జడ్పిటిసి, నామినేషన్లను ప్రశాంత వాతావరణంలో ప్రశాంతంగా జరిగించారు.



# ఓటరు స్లిప్పుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలి

**ఈ నెల 26వ తేదీలోపు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి**
**ఓటర్లకు స్లిప్పులు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదు**
**చరవాణి ద్వారా వార్డు, పోలింగ్ కేంద్రం వివరాలుతెలుసుకునే సౌలభ్యం**
**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్):** కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 28న జరగనున్న పోలింగ్కు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, ఈ నెల 26వ తేదీలోపు పూర్తి చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఓటరు స్లిప్పుల ప్రతులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఓటరు స్లిప్పుల పంపిణీ కీలకమైనదని, ప్రతి ఓటరుకు స్లిప్పు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్లిప్పు ఇచ్చాక రశీదుపై కుటుంబంలో ఒకరి నుంచి సంతకం తీసుకోవాలని సూచించారు. ఓటర్లు తమ వార్డు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవాలంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ జ్టిఇట//ట్చఛి-ఛ్రుఝట్చఇఃజౌరి.జీ ద్వారా వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

# ఈ ముగ్గురిని ఊరిస్తున్న రికార్డులు!

న్యూజిలాండ్తో ఐదు టీ20ల సిరీస్ కోసం భారత్ సిద్ధమైంది. గురువారం ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఇందుకు వేదిక క్రైస్ట్చర్చ్. దాదాపు నాలుగేళ్ల తర్వాత పునరాగమనం చేసిన భువనేశ్వర్తోపాటు యువ పేసర్ అర్ష్దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ అరుదైన మైలురాళ్లకు చేరువగా ఉన్నారు.



**భువీ ఇలా..**

● టీ20ల్లో సెంచరీ వికెట్లు: ఇప్పటివరకు భారత్ తరఫున 87 టీ20 మ్యాచ్లు ఆడిన భువనేశ్వర్.. 23.10 సగటుతో 90 వికెట్లు పడగొట్టారు. ఈ పర్యటనలో మరో 10 వికెట్లు తీస్తే, పొట్టి ఫార్మాట్లో 100 వికెట్ల స్థాయిని అందుకున్న ఐదో భారత బౌలర్గా చరిత్రకెక్కుతాడు. అతడి కంటే ముందు అర్ష్దీప్ (145), బుమ్రా (126), హార్దిక్ పాండ్య (114), అక్షర్ పటేల్ (113) మాత్రమే శతక వికెట్లు తీశారు.

● అంతర్జాతీయంగా 300 వికెట్లు: అన్ని ఫార్మాట్లు కలుపుకొని భువీ ఖాతాలో ప్రస్తుతం 294 వికెట్లు ఉన్నాయి. మరో 6 వికెట్లు సాధిస్తే అంతర్జాతీయ క్రికెట్లో మొత్తం 300 వికెట్లు పూర్తి చేసుకున్న 14వ భారత బౌలర్గా (పేసర్ల విభాగంలో 9వ బౌలర్గా) ఘనత సాధిస్తాడు.

**తొలి బౌలర్గా అర్ష్దీప్..**

● 150 మార్క్: భారత టీ20 స్పెషలిస్ట్ పేసర్ అర్ష్దీప్ అరుదైన ఘనతకు చేరువగా ఉన్నాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 145 వికెట్లు ఉన్నాయి. పొట్టి ఫార్మాట్లో టీమ్ఇండియా తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్గానూ అతడే కొనసాగుతున్నాడు. మరో ఐదు వికెట్లు తీస్తే భారత్ తరఫున 150 వికెట్లు తీసిన తొలి బౌలర్గా అవతరిస్తాడు. ఓవరాల్గా తొమ్మిదో బౌలర్ అవుతాడు.

● వందో మ్యాచ్: న్యూజిలాండ్తో తొలి టీ20 మ్యాచ్ అతని కెరీర్లో వందోది కావడం గమనార్హం. ఇలా 100 అంతకంటే ఎక్కువ మ్యాచులు ఆడిన ఏడో భారత క్రికెటర్గా నిలుస్తాడు. రోహిత్ శర్మ (159) అందరికంటే ఎక్కువ ఆడాడు.

**కుల్దీప్.. ఇంకో రెండు తీస్తే**

చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా ఓ ఘనతను తన ఖాతాలో వేసుకొనేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ప్రస్తుతం 56 మ్యాచులు ఆడిన కుల్దీప్ 98 వికెట్లు పడగొట్టాడు. మరో రెండు వికెట్లు తీస్తే వంద వికెట్ల రికార్డును అందుకొంటాడు.

## ఆయన సపోర్ట్ వల్లే ఈ స్థాయికి వచ్చాను.. - మమితా బైజు



మలయాళ బ్యూటీ మమితా బైజు, నివిన్ పౌలీ, కాంబినేషన్లో వచ్చిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ఘనవిజయాన్ని అందుకంది. కేవలం రూ. 25 కోట్ల బడ్జెట్తో తెరకెక్కిన ఈ చిత్రం, ఓనం కానుకగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ. 325 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ఇండస్ట్రీ హిట్గా నిలిచింది. ఈ మూవీ అద్భుత విజయం సాధించిన సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించగా.. ఇందులో హీరోయిన్ మమితా బైజు పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు.

తన సినీ ప్రయాణంలో ప్రధాన పాత్రలు చేయగలననే నమ్మకం తనకే లేని సమయంలో, డైరెక్టర్ గిరీష్ ఏడీ తనపై ఎంతో నమ్మకం ఉంచారని చెప్పారు. ఏమీ తెలియని ఒక సామాన్య వ్యక్తికి ఎవరైనా అండగా నిలబడి ప్రోత్సహిస్తే ఆ వ్యక్తికి సమాజంలో ఒక ప్రత్యేక గౌరవం, విలువ లభిస్తాయని.. గిరీష్ విషయంలో తనకు సరిగ్గా అలాగే అనిపించిందని తెలిపారు. 'ప్రేమలు' చిత్రం నుంచి 'బెత్లెహెం కుటుంబ యూనిట్' వరకు తనను నమ్మి అవకాశాలు ఇచ్చినందుకు గిరీష్కి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

## పారా ఆసియా క్రీడలు.. 60+ మెడల్స్.. నాలుగో ప్లేస్కు భారత్



కీలక సమయంలో భారత అథ్లెట్లు అదరగొట్టేస్తున్నారు. దీంతో పారా ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 61కి చేరింది. ఇందులో 14 స్వర్ణాలు, 21 రజతాలు, 26 కాంస్యాలు ఉన్నాయి. దీంతో పట్టికలో నాలుగో ప్లేస్కు చేరుకుంది. చైనా (211) టాప్లో కొనసాగుతోంది.

**స్వర్ణాల వర్షం..**

భారత అథ్లెట్లు స్వర్ణాల వేట కొనసాగిస్తున్నారు. దిలీప్ గావిట్ పురుషుల 100 మీ టీ47 రేసును 10.69 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో మోర్సింగ్నకత్ (10.72 సెకన్లు) రెండో స్థానంలో నిలిచి రజతం సొంతం చేసుకున్నాడు. మహిళల 100 మీటర్ల విభాగంలో 12.02 సెకన్లతో రేసును పూర్తి చేసిన సిమ్రాన్ కొత్త రికార్డు సృష్టించింది. దీంతో మరో స్వర్ణం ఆమె ఖాతాలో పడింది. ఇప్పటికే 200 మీ. టీ12

వైభవ్కు తుది జట్టులో చోటు కష్టమే..

## భువీకి బాగా తెలుసు: శ్రేయస్

ఇప్పటికిప్పుడు భారత యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశాలు రావడం కష్టంగానే అనిపిస్తోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యాఖ్యలను చూస్తే అలాగే ఉంది. వైభవ్ మరికొంత కాలం వేచి చూడాలనే ధోరణిలోనే శ్రేయస్ వ్యాఖ్యానించాడు. గురువారం నుంచి న్యూజిలాండ్తో ఐదు టీ20ల సిరీస్ మొదలుకానుంది. ఈ క్రమంలో శ్రేయస్ ప్రెస్ కాన్ఫరెన్స్లో మాట్లాడాడు. ''వైభవ్ వంటి అద్భుతమైన నైపుణ్యం కలిగిన ఆటగాడికి అవకాశాలు రాకపోయినా.. డ్రెస్సింగ్ రూమ్లో సంతోషంగా ఉంచడం ముఖ్యం. ఇంకా అతడు కుర్రాడే. అవకాశాలు పొందడానికి చాలా సమయం ఉంది. ఇప్పటికిప్పుడు అతడు జట్టులోకి వచ్చేస్తాడని చెప్పలేను. ప్రస్తుతం ఓపెనర్లు నిలకడగా పరుగులు చేస్తున్నారు. వారిద్దరూ ప్రపంచ కప్పు గెలిపించిన బ్యాటర్లు. ఇప్పుడు జట్టుతోపాటు వైభవ్ విదేశాలకూ వస్తే పిచ్లపై ఎలా ఆడాలో ఓ అవగాహన వస్తుంది. మరోసారి ఇక్కడ పర్యటించినప్పుడు అందుకు మెరుగ్గా సన్నద్ధమవుతాడు. మొదటిసారి వచ్చే సహచరులకూ సూచనలు ఇవ్వగలడు'' అని శ్రేయస్ వెల్లడించాడు.

## నా శరీరం.. నా ఇష్టం.. - పాయల్



పాయల్ రాజ్పుత్ శరీరాకృతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ, కొన్ని వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్న వారిపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన శరీరం, తన రూపం గురించి వ్యాఖ్యానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి ఎక్స్ లో ఘాటుగా స్పందించారు. 'నా శరీరం, నా సైజు, నా గర్వం. ఇవి మీకు సంబంధించిన విషయాలు కావు. మీ హద్దుల్లో మీరు ఉండండి. మీ పని మీరు చేసుకోండి' అంటూ బాడీ షేమింగ్కు పాల్పడుతున్న వారికి గట్టిగా బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

సినిమాల విషయానికి వస్తే..

తెలుగులో 'ఆర్ఎక్స్ 100' తర్వాత ఆమె వరుసగా 'ఆర్డీఎక్స్ లవ్', 'వెంకీ మామ', 'డిస్కో రాజా' వంటి సినిమాల్లో నటించింది. 2023లో వచ్చిన మంగళవారం సినిమాలో మరో సారి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత 'రక్షణ'చిత్రంలో పోలీస్ ఆఫీసర్గా మెప్పించింది.

## మహాశక్తిగా నయన్ విశ్వరూపం..



నయనతార ప్రధాన పాత్ర చేసిన లేటెస్ట్ సినిమా 'మూకుతి అమ్మన్ 2'. సుందర్.సి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో 'మహాశక్తి' పేరుతే వచ్చే నెల 06న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు.

ఆర్జే బాలాజీ దర్శకత్వంలో మూకుతి అమ్మన్ తొలి భాగం సింపుల్గా తీసినప్పటికీ.. ఈసారి మాత్రం భారీ గ్రాఫిక్స్, దద్దరిల్లే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ పెట్టారు. అయితే గ్రాఫిక్స్పైసోషల్ మీడియాలో విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు స్టార్ హీరోలు చేసే సేవియర్ టైప్ కథతో దీన్ని తెరకెక్కించారు. ఓ ఊరు, అందులోని ఓ కుటుంబానికి ఆపద వస్తే స్వయంగా అమ్మవారు వచ్చి, వాళ్లని ఎలా కాపాడింది అనేది స్టోరీలా అనిపిస్తుంది. మరి నయన్ ఈ మూవీతో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి?

## మౌళి 'దొంగ నా కొడుకు' టీజర్ విడుదలకు ముహూర్తం ఫిక్స్..

యంగ్ టాలెంటెడ్ యాక్టర్ మౌళి తనుజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'దొంగ నా కొడుకు'. ఈ చిత్రాన్ని టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. శ్రీను కంబాల దర్శకత్వంలో రాబరీ, క్రైమ్, కామెడీ జోనర్తో ఈ మూవీ తెరకెక్కుతోంది. నవంబర్ 13న ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించిన మేకర్స్.. తాజాగా ప్రమోషన్స్లో స్పీడ్ పెంచారు. ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన టీజర్ అప్డేట్ను అఫీషియల్గా అనౌన్స్ చేశారు. అక్టోబర్ 21న ఈ మూవీ టీజర్ను విడుదల చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'అతని పిచ్చిని బిగ్ స్క్రీన్ ప్రదర్శించి నవ్వించడానికి మౌళి తనుజ్ రాబోతున్నాడు' అని రాసుకొచ్చారు.



## ఇది కలలో కూడా ఊహించలేదు.. నాకు అత్యంత ప్రత్యేకమైన క్షణం.. - సమంత

సినిమాలకు కాస్త దూరం అయిన టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు కుకింగ్ రియాలిటీ షో 'సెలబ్రిటీ మాస్టర్చెఫ్ తమిళ'తో హోస్ట్గా బుల్లితెరపై కొత్త ప్రయాణం ప్రారంభించారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ ప్రాజెక్ట్తో ఉన్న తన అనుబంధం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. 'ఇది నాకు కచ్చితంగా అత్యంత ప్రత్యేకమైన క్షణం. నేను చిన్నగా ఉన్నప్పుడు 'మాస్టర్చెఫ్' చూడటం మా ఇంట్లో ఒక ఫ్యామిలీ ఈవెంట్ లాంటిది. మా అమ్మ, నేను కలిసి ఎప్పుడూ 'మాస్టర్చెఫ్' చూసేవాళ్లం, అది మా ఇద్దరి మధ్య మంచి బాండింగ్ టైమ్.

అలాంటిది ఇన్ని సంవత్సరాల తర్వాత, 'సెలబ్రిటీ మాస్టర్చెఫ్ తమిళ'కు సెలబ్రిటీ హోస్ట్గా మారడం అనేది నేను కలలో కూడా ఊహించలేదు. ఇది అసలు జరుగుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. అందుకే ఇది నాకు చాలా స్పెషల్. 'సెలబ్రిటీ మాస్టర్చెఫ్ తమిళ' నేను ఇప్పటివరకు చేసిన వాటికి పూర్తిగా భిన్నమైనది, అందుకే దీన్ని నో చెప్పడం నా వల్ల కాలేదు. ఆహారానికి మనుషులను దగ్గర చేసే, జ్ఞాపకాలను సృష్టించే అద్భుతమైన శక్తి ఉంది'' అని చెప్పుకొచ్చారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.